RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | బుధవారం, మే 20, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 36 | పేజీలు: 8 | వెల : రూ.1



ఏసీబీ వలకు జలమండలి

## అవినీతి తిమింగలం

1.10 కోట్ల నగదు, కేజీ బంగారం స్వాధీనం

### కేంద్రమంత్రి పదవికి ఈటల రాజేందర్ పేరు?

# తెలంగాణ బీజేపీలో జోరుగా ప్రచారం

తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన భగీరథ్ పోక్సో కేసు వ్యవహారం ఇప్పుడు ఢిల్లీ రాజకీయ వర్గాల్లో కూడా హాట్ టాపిక్‌గా మారినట్లు చర్చ సాగుతోంది. రాష్ట్రంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలు, కేంద్ర మంత్రివర్గంలో మార్పులపై ఊహాగానాల మధ్య తెలంగాణకు చెందిన నేతలకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలో భారీ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశమున్నట్లు ఢిల్లీ భారతీయ జనతా పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. రాష్ట్రాల వారీగా రాజకీయ సమీకరణాలు, సామాజిక వర్గాల ప్రాతినిధ్యం, రాబోయే ఎన్నికల వ్యూహాలను దృష్టిలో పెట్టుకుని కీలక మార్పులు ఉండొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణకు చెందిన పలువురు నాయకుల పేర్లు చర్చకు వస్తుండగా, ముఖ్యంగా మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నట్లు సమాచారం. తెలంగాణ ఉద్యమకారుడిగా గుర్తింపు పొందిన ఆయనకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి అప్పగించే అవకాశాలపై ఢిల్లీ రాజకీయ, బీజేపీ వర్గాల్లో ప్రచారం సాగుతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో బీసీ సామాజిక వర్గ సమీకరణాలు, పార్టీ విస్తరణ, రాబోయే ఎన్నికల వ్యూహాలు, రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అధిష్టానం ఆలోచిస్తున్న నేపథ్యంలో ఈటల రాజేందర్‌కు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పదవిపై కూడా రాజకీయ చర్చ మొదలైంది. భగీరథ్ పోక్సో కేసు నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ విమర్శలు, ప్రతిపక్ష పార్టీల నిరసనలు, సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న చర్చలతో బండి సంజయ్‌పై ఒత్తిడి పెరిగినట్లు రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణకు సంబంధించి



మార్పులు జరిగే అవకాశాలపై ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా, ఈ నెల 26తో మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకోనుంది. ప్రస్తుతం కేంద్ర మంత్రివర్గంలో 72 మంది సభ్యులు ఉండగా, రాజ్యాంగ పరిమితి ప్రకారం గరిష్టంగా 81 మంది మంత్రులను నియమించుకునే అవకాశం ఉంది. దీంతో త్వరలోనే కేంద్ర కేబినెట్ విస్తరణ ఉండొచ్చన్న ప్రచారం జాతీయ రాజకీయాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. గత రెండు పర్యాయాల్లో కూడా మోడీ ప్రభుత్వం క్రమం తప్పకుండా మంత్రివర్గాన్ని విస్తరించిన నేపథ్యంలో, ఈసారి కూడా ప్రాంతీయ, కుల సమతుల్యతతో పాటు ఎన్నికల వ్యూహాలను దృష్టిలో పెట్టుకుని కొత్త ముఖాలకు అవకాశం కల్పించే అవకాశాలున్నాయని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. వచ్చే ఏడాది పలు రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికల దృష్ట్యా ఈ మార్పులు కీలకంగా మారనున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## డిజిటల్ రూపాయి

### భవిష్యత్ ఆర్థిక వ్యవస్థకు పునాది

ముంబై, మే 19 : భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ప్రవేశపెట్టిన రిటైల్ డిజిటల్ రూపాయి (వ?) దేశ ద్రవ్య వ్యవస్థలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతోంది. ఇది క్రిప్టోకరెన్సీ కాదు, ఆర్‌బీఐ జారీ చేసే మన కరెన్సీ నోట్లకు, నాణేలకు ఉన్న డిజిటల్ రూపం. సాధారణ డబ్బుకు ఉన్న విలువే దీనికీ ఉంటుంది. ప్రస్తుతం చాలా ప్రధాన బ్యాంకులు డిజిటల్ రూపాయి వాలెట్లను అందిస్తున్నాయి. ఇది కేవలం మరో చెల్లింపుల విధానం కాదు, డబ్బు స్వరూపాన్నే ఆధునికీకరించే ప్రణాళికలో కీలక భాగమని నిపుణులు చెబుతున్నారు. ఛాయిస్ వెల్త్ పరిశోధన విభాగం అధిపతి అక్షత్ గర్గ్ ప్రకారం డిజిటల్ రూపాయి అనేది ఆర్‌బీఐ అందిస్తున్న డిజిటల్ నగదు. ఇది ఆన్‌లైన్‌లో సాధారణ డబ్బులా పనిచేస్తుంది. దీనివల్ల లావాదేవీలు వేగవంతం అవ్వడమే కాకుండా, సెటిల్‌మెంట్ రిస్కులు తగ్గి ఆర్థిక వ్యవస్థలో

(మిగతా 2వ పేజీలో)




## భారత్‌లో ఎవరూ అడ్డుకోలేనటువంటి తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుంది

### ::: లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరిక

న్యూ డిల్లి మే 19 : భారత్‌లో ఎవరూ అడ్డుకోలేనటువంటి తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుందని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రధాని మోదీ ఆర్థిక విధానాలు విఫలమవుతున్నాయని, ఆ తర్వాత వాటిల్లే భారీ నష్టాన్ని సామాన్యుడే ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాయ్‌బరేలీలో ఓ సభలో పాల్గొన్న రాహుల్, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలను తప్పుబట్టారు. శ్రామిక వర్గాన్ని నష్టపరిచి, బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక వ్యవస్థను రూపొందించారని దుయ్యబట్టారు. పౌరులను విదేశీ ప్రయాణాలను తగ్గించుకోమని కోరుతున్న ప్రధాని, తాను మాత్రం తరచూ విదేశాలకు వెళుతున్నారని విమర్శించారు. సమస్య పెట్రోల్, విద్యుత్ వాహనాలతో కాదని, అది ద్రవ్యోల్బణంతో అని ప్రధాని అర్థం చేసుకోవాలని సూచించారు. వెంటనే చర్యలు తీసుకుని దేశాన్ని రక్షించాలని కోరారు. "భారీ ఆర్థిక తుపాన్ రాబోతోంది. దీన్ని ఎవరూ అడ్డుకోలేరు. అంత తీవ్రమైన ఆర్థిక తుపాన్ రాబోతోంది. అది ఎంతపెద్దది అంటే మీరు, నేను మన జీవితంలో ఎప్పుడూ చూడలేనంత పెద్దది. దెబ్బ ఎవరికి తగులుతుంది? అంబానీ, అదానీలకు తగలదు. వాళ్లు తమ ప్యాలెస్‌లో కూర్చుని ఉంటారు. వాళ్ల ప్యాలెస్‌ల చుట్టూ భద్రత ఉంటుంది. భారత రైతుకు, కార్మికుడికి, యువతకు, చిన్న వ్యాపారస్థులకు, చిన్న పరిశ్రమలకు దెబ్బతగులుతుంది. ఏవైతే ఉపాధిని కల్పిస్తాయో, వాటికి నష్టం కలగనుంది. ఇప్పుడు మేం చెప్తున్నాం నెలల ముందు నుంచే నేను చెప్తున్నాను. ఆర్థిక తుపాన్


(మిగతా 2వ పేజీలో)



## సెప్టెంబర్‌లో భారత్‌కు పుతిన్

## యుద్ధ ప్రాతిపదికన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల భూ సేకరణ ప్రక్రియ





## ఢిల్లీలో టీడీపీ ఆఫీస్

## వంట నూనెలపై భారం తప్పదా...



న్యూఢిల్లీ, మే 19, ( వాయిస్ టుడే ) : ప్రజలకు ధరల పోటు తప్పేలా లేదు. వంట నూనెల ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. దీనికి కారణం కేంద్రం తీసుకోబోయే నిర్ణయమే.స్థానిక రైతులకు మద్దతివ్వడం, రూపాయిపై ఒత్తిడిని తగ్గించడం కోసం వంట నూనెలపై దిగుమతి సుంకాలను పెంచే ప్రతిపాదనను భారత ప్రభుత్వం పరిశీలిస్తోంది. వంట నూనెలపై అధిక దిగుమతి పన్నులు.. రైతులు తమ పంటలకు మెరుగైన ధరలు పొందేందుకు సాయపడతాయా, అలాగే భారీ సరుకుల దిగుమతులతో ముడిపడి ఉన్న విదేశీ మారక ద్రవ్య ప్రవాహాలను అరికట్టగలవా అనే విషయాన్ని అధికారులు సీరియస్ గా పరిశీలిస్తున్నారు.ఈ ఏడాది ఆసియాలో రూపాయి అత్యంత బలహీనమైన కరెన్సీగా

(మిగతా 2వ పేజీలో)



## మంత్రివర్గ ప్రక్షాళనకు రెడీ

హైదరాబాద్, మే 19, ( వాయిస్‌టుడే) : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి రెండున్నరేళ్లు కావస్తుంది. ఇప్పటికీ మంత్రివర్గంలో పూర్తిగా భర్తీ చేయలేదు. ఇంకా మంత్రివర్గంలో రెండు స్థానాలు ఖాళీలున్నాయి. ఎప్పటికప్పుడు మంత్రివర్గంలో ఖాళీలను భర్తీ చేస్తామని ఊరిస్తూనే ఉన్నారు. కానీ ఇంతవరకూ భర్తీ చేయకపోవడంతో ఆశావహుల్లో నిరాశ కలుగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లినప్పుడల్లా పార్టీ పెద్దలతో మంత్రివర్గ విస్తరణపై చర్చించడానికి అంటూ ప్రచారం జరుగుతుండటం, రేవంత్ రిక్త హస్తాలతో తిరిగి రావడం సాధారణంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలు ఇంకా పూర్తి కావాల్సి ఉంది. అవి పూర్తయిన తర్వాతనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని పార్టీలో ప్రచారం జరుగుతుంది.తెలంగాణలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి. ఇక గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ తో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఎన్నికలు ముగిసిన తర్వాత రేవంత్ రెడ్డి ప్రస్తుతం ఉన్న మంత్రివర్గంలో పూర్తి స్థాయి ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రెండున్నరేళ్లు కొందరికి మంత్రిగా అవకాశం కల్పించాం కాబట్టి, వారిని తప్పించి, వారి స్థానంలో కొత్త వారిని నియమించుకోవాలన్నది రేవంత్ రెడ్డి ఆలోచనగా ఉంది. ఇది పూర్తి స్థాయి ఎన్నికల టీంగా రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసుకోవాలని

(మిగతా 2వ పేజీలో)

## గ్రేటర్ ఎన్నికలకు గులాబీ ప్లాన్




హైదరాబాద్, మే 19, (వాయిస్‌టుడే) : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, భాగ్యనగర రాజకీయం అప్పుడే వేడెక్కింది. జీహెచ్ఎంసీ పీఠంపై మరోసారి గులాబీ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ తన వ్యూహాలకు పదును పెడుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అధిక స్థానాలను సాధించి తన పట్టును నిరూపించుకున్న బీఆర్ఎస్, అదే జోష్‌తో మున్సిపల్ ఎన్నికల బరిలోకి దిగేందుకు సమాయత్తమవుతోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగి, ఓటర్ల జాబితా సవరణ నుంచి సభ్యత్వ నమోదు వరకు ప్రతి అంశాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటూ కేడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నారు.గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, తమ పార్టీ సానుభూతిపరులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతు కాకుండా బీఆర్ఎస్ పకడ్బందీ చర్యలు చేపట్టింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై పార్టీ శ్రేణులను పూర్తిగా అలర్ట్ చేసింది. ఈ నెల 25 నుంచి ఈ ప్రక్రియ రాష్ట్రంలో ప్రారంభం కానుండటంతో, ప్రతి డివిజన్, పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని కేటీఆర్

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ ఆఫ్ ప్రజలు

బుధవారం, మే 20, 2026

# డిజిటల్ రూపాయి



పారదర్శకత పెరుగుతుందని ఆయన వివరించారు. ప్రోగ్రామబుల్ పేమెంట్స్, ఆఫ్‌లైన్ వినియోగం వంటి ఫీచర్లు అందుబాటులోకి వస్తే, దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులు మరింత విస్తరిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా, అంతర్జాతీయ స్థాయిలో సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) వాడకాన్ని భారత్ పరీక్షిస్తున్న తరుణంలో, డాలర్ ఆధారిత వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించి, విదేశీ చెల్లింపులను సులభతరం చేసే శక్తి డిజిటల్ రూపాయికు ఉందని ఆయన పేర్కొన్నారు. లాంగ్ టెయిల్ వెంచర్స్ వ్యవస్థాపకుడు పరమదీప్ సింగ్ మాట్లాడుతూ, డిజిటల్ రూపాయి అనేది యూపీఐకి పోటీగా వచ్చిందని భావించడం సరికాదన్నారు. ఇప్పటికే యూపీఐతో భారత్ డిజిటల్ చెల్లింపుల రంగంలో అగ్రస్థానంలో ఉందని, అయితే డిజిటల్ రూపాయి లక్ష్యం అది కాదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మొత్తం చెల్లింపుల వ్యవస్థకు ఇది ఒక నిశ్శబ్ద పునాదిగా మారుతుందని ఆయన అంచనా వేశారు. ఆఫ్‌లైన్ చెల్లింపులు, స్మార్ట్ కాంట్రాక్టులు, వేగవంతమైన క్లియరింగ్ వంటి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడమే దీని అసలు శక్తి అని, వినియోగదారులకు స్పష్టమైన ప్రయోజనాలు కనిపిస్తేనే ప్రజలు, వ్యాపారులు దీన్ని స్వీకరిస్తారని తెలిపారు.

**ప్రయోజనాలు.. సవాళ్లు**

అలంకిత్ లిమిటెడ్ సీఎఫ్‌ఓ గౌరవ్ మహేశ్వరి ప్రకారం డిజిటల్ రూపాయి అనేది భారత ప్రభుత్వం మద్దతు ఉన్న వేగవంతమైన, సురక్షితమైన డిజిటల్ నగదు. 2025 మార్చి నాటికి రూ.1,016 కోట్ల విలువైన డిజిటల్ కరెన్సీ చలామణిలో ఉందని, లక్షలాది వాలెట్లు ఉన్నాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా ఆఫ్‌లైన్ ఫీచర్ పూర్తిగా అందుబాటులోకి వస్తే, మారుమూల ప్రాంతాలకు కూడా డిజిటల్ చెల్లింపులను విస్తరించవచ్చని, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీల పంపిణీని మరింత సమర్థవంతంగా మార్చవచ్చని ఆయన అన్నారు. అయితే, సైబర్ సెక్యూరిటీ, వ్యక్తిగత గోప్యత, ప్రభుత్వ నిఘా వంటి ప్రమాదాల గురించి ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం డిజిటల్ రూపాయి ఒక పైలట్ ప్రాజెక్టు దశను దాటి ముందుకు సాగుతోంది. ఇటీవలి నివేదికల ప్రకారం, దేశవ్యాప్తంగా లావాదేవీలు రూ.34,000 కోట్లు దాటాయి. మరిన్ని బ్యాంకులను భాగస్వామ్యం చేస్తూ, ఆర్‌బీఐ దీని విస్తరణను వేగవంతం చేస్తోంది. యూపీఐ అనేది బ్యాంకు ఖాతాల మధ్య డబ్బును బదిలీ చేస్తే, డిజిటల్ రూపాయి మాత్రం ఆర్‌బీఐ జారీ చేసిన డిజిటల్ టోకెన్ రూపంలో నేరుగా డబ్బే కావడం గమనార్హం. ప్రస్తుతానికి యూపీఐ ఆధిపత్యం కొనసాగినప్పటికీ ఆఫ్‌లైన్ చెల్లింపులు, ప్రోగ్రామబుల్ ఫండ్స్ వంటి అధునాతన ఫీచర్లు అందుబాటులోకి వస్తే, ఇతర వ్యవస్థలు పరిష్కరించలేని సమస్యలకు డిజిటల్ రూపాయి సమాధానం అవుతుంది. రానున్న కాలంలో మారుమూల ప్రాంతాల్లో డిజిటల్ నగదును సులభతరం చేయడం, ప్రభుత్వ ప్రయోజనాల పంపిణీని మెరుగుపరచడం, అంతర్జాతీయ చెల్లింపులను చౌకగా, వేగంగా మార్చడం ద్వారా భారత ఆర్థిక మౌలిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## భారత్‌లో ఎవరూ అడ్డుకోలేనటువంటి తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుంది



వస్తోంది, సిద్ధం కావాలి అని. ప్రజలకు భారీ దెబ్బ తగలబోతోంది, పెట్రోల్ ధరలు పెరగబోతున్నాయని, ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకబోతోందని చెబుతున్నాను. వాళ్లేమో (బీజేపీ) రాహుల్ గాంధీకి ఏం అవగాహన లేదని అంటున్నారు. ఇరాన్– అమెరికా మధ్య యుద్ధం చెలరేగడంతో మన ఇంధన సరఫరాలను ఇరాన్ నిలిపివేసింది. ఫలితంగా దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడింది. పెట్రోల్, డీజిల్‌ను పొదుపుగా వాడుకోవాలని, ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని మోదీ ప్రజలకు సలహా ఇస్తున్నారు. కానీ, మరుసటి రోజే మోదీ స్వయంగా విదేశాలకు వెళ్తున్నారు.”


**ప్రభుత్వాన్ని మార్చాలని ప్రజలకు రాహుల్ గాంధీ పిలుపు**

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వాన్ని మార్చకపోతే దేశం మనుగడ సాగించలేదని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజకీయ వాస్తవాలపై ప్రజలు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన లోపించడం వల్లే ఎంజీఎన్ఆర్ఈజీఏ వంటి గ్రామీణ సామాజిక భద్రతా కార్యక్రమాలు పూర్తిగా రద్దు అవుతున్నాయని, చిన్న రైతులు ఆర్థికంగా నాశనమవుతారని హెచ్చరించారు. మరోవైపు దేశ అగ్ర నాయకులు మాత్రం కార్పొరేట్ సామాజిక కార్యక్రమాలకు హాజరుకావడానికే దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు.

## ఢిల్లీలో టీడీపీ ఆఫీస్

న్యూఢిల్లీ, మే 19, ( వాయిస్ టుడే ) : దేశ రాజధాని ఢిల్లీలో తెలుగోడి ఆత్మ గౌరవానికి తూట్లు పడుతున్నాయని నాడు తెలుగు ప్రజల ఆరాధ్య దైవం దివంగత నందమూరి తారక రామారావు ఆవేదనకు లోనయ్యారు. అలాంటి పరిస్థితులను రూపుమాపి.. ఢిల్లీ నడి వీధుల్లో తెలుగోడి పవర్ ఏమిటో చూపాలన్న కసితో సాగిన ఎన్టీఆర్... తెలుగు దేశం పార్టీ (టీడీపీ)పేరిట పార్టీని స్థాపించి సత్తా చాటారు. ఎన్టీఆర్ చేతుల్లో పురుడు పోసుకున్న టీడీపీ జెండా ఇప్పుడు ఢిల్లీ నడి వీధుల్లో రెపరెపలాడనుంది. అది కూడా ఢిల్లీలోని ఏదో మూల అనుకుంటే తప్పులో కాలేసినట్టే. ఎందుకంటే... ఢిల్లీ నగరం నడిమధ్యలో సిటీ ప్రైమ్ లొకేషన్ లో టీడీపీ తన కేంద్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు వేగంగా అడుగులు పడుతున్నాయి. టీడీపీ ఆవిర్భవించి అప్పుడే నాలుగు దశాబ్దాలు గడిచిపోతున్నా... దేశ రాజకీయాల్లో చాలా సార్లు కీలక పార్టీగా పనిచేసినా.. ఇప్పటిదాకా దేశ రాజధాని నగరం ఢిల్లీలో పార్టీకి కార్యాలయం అంటూ లేదు. టీడీపీ వ్యవస్థాపకుడైన ఎన్టీఆర్ కు భారత రత్న ఇవ్వాలన్న డిమాండ్ ను నిత్యం వినిపిస్తూ వస్తున్న టీడీపీ నేతలు... పార్టీకి ఢిల్లీలో కేంద్ర కార్యాలయం గురించి అంతగా పట్టించుకోలేదనే చెప్పాలి. అయితే తన నలభై ఏళ్ల ప్రస్థానంలో దేశ రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతంగా సాగుతున్న టీడీపీకి ఇప్పుడు ఢిల్లీలో కార్యాలయం కావాలని పార్టీ అధిష్ఠానం భావించింది. అనుకున్న వెంటనే ఆ విషయాన్ని కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు వద్ద ప్రతిపాదించింది. కేంద్రంలోని ఎన్డీఏ సర్కారుకు ఊపిరిగా నిలుస్తున్న టీడీపీ అడగడమే ఆలస్యం అన్నట్లుగా కేంద్రం.. ఈ ప్రతిపాదనపై వేగంగా స్పందించింది. టీడీపీ ప్రతిపాదనను త్వరితగతిన పరిశీలించాలంటూ ఢిల్లీ సర్కారుకు ఆదేశాలు జారీ చేసింది. వెరసి టీడీపీ ప్రపోజల్ ను తెరచిన ఢిల్లీ సర్కారు... శరవేగంగా దానిపై ఓ నిర్ణయం తీసుకుంది. తాను చేసిన ప్రతిపాదనకు ఢిల్లీ సర్కారు నుంచి వచ్చిన స్పందనకు టీడీపీ ఓకే అనడమే ఆలస్యం క్షణాల్లో టీడీపీ కేంద్ర కార్యాలయ నిర్మాణానికి అవసరమైన స్థలం ఇట్టే దక్కిపోతుంది. ఆపై కళ్లు మూసి తెరిచేలోగానే ఢిల్లీ నడి వీధుల్లో తెలుగోడి ఆత్మ గౌరవాన్ని రెపరెపలాడించేలా టీడీపీ జెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తోంది. దేశ రాజకీయాల్లో కీలక భూమిక పోషిస్తున్న టీడీపీ.. ఢిల్లీ తన కేంద్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలని భావిస్తోందని ఆ పార్టీ అధిష్ఠానం కేంద్రానికి ఓ ప్రతిపాదన పంపింది. పార్టీ కార్యాలయం కోసం 2 వేల చదరపు మీటర్ల స్థలం కావాలని కోరింది. కేంద్రం ఆదేశాలతో ఈ ప్రతిపాదనను పరిశీలించిన ఢిల్లీ సర్కారు... దీన్ దయాళ్ మార్గ్ లో బీజేపీ కేంద్ర కార్యాలయం పక్కనే ఖాళీగా ఉన్న 1,200 చదరపు మీటర్ల స్థలాన్ని గుర్తించింది. ఎలాంటి వివాదాలు లేని ఈ స్థలాన్ని టీడీపీకి తక్షణమే బదలాయించవచ్చని ఢిల్లీ చీఫ్ ఆర్కిటెక్ట్ కేంద్రానికి సిఫారసు చేశారు. ఈ విషయాన్ని టీడీపీకి చేరవేసిన కేంద్రం... తక్షణమే ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరింది. వెరసి తెలుగోడి ఆత్మ గౌరవానికి తూట్లు పడిన అదే ఢిల్లీ నడి వీధుల్లో అదే తెలుగోడి ఆత్మ గౌరవం సగర్వంగా నిలవనుంది.

## సెప్టెంబర్‌లో భారత్‌కు పుతిన్



న్యూఢిల్లీ, మే 19 : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఏడాది సెప్టెంబర్ 12, 13 తేదీల్లో భారత్ లో పర్యటించనున్నారు. భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ రానున్నట్లు ఆ దేశ అధ్యక్ష భవనం ‘క్రెమ్లిన్’ మంగళవారం అధికారికంగా ధృవీకరించింది. భారత్, రష్యా మధ్య వ్యూహాత్మక, రక్షణ రంగ బంధం బలపడుతున్న తరుణంలో పుతిన్ పర్యటన ఖరారు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత డిసెంబర్‌లో జరిగిన 23వ భారత్–రష్యా వార్షిక సదస్సు కోసం పుతిన్ ఢిల్లీకి వచ్చారు. ఆ సమయంలో మోదీతో కలిసి ద్వైపాక్షిక సంబంధాల విస్తరణపై చర్చలు జరిపారు. ఆ పర్యటన జరిగిన ఏడాదిలోపే పుతిన్ రెండోసారి భారత్‌కు వస్తుండటం గమనార్హం. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం 2022లో ప్రారంభమైన తర్వాత పుతిన్ గతేడాది డిసెంబర్‌లోనే మొదటిసారి భారత్‌లో అడుగుపెట్టారు. దానికి ముందు ఆయన 2021లో ఢిల్లీని సందర్శించారు. భారత్–రష్యా మధ్య ఏటా ఒకసారి ఇరు దేశాల అధినేతలు భేటీ అయ్యే సంప్రదాయం ఉంది. ఒక ఏడాది భారత్‌లో జరిగితే, మరో ఏడాది రష్యాలో ఈ వార్షిక సదస్సు జరుగుతుంది. భారత్ నేతృత్వంలో ఢిల్లీలో జరగబోయే ఈ ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ సదస్సులో.. ప్రపంచ భద్రతా సవాళ్లు, ఆర్థిక సహకారం బలోపేతం చేయడం వంటి కీలక అంశాలపై సభ్య దేశాల అధినేతలు చర్చించనున్నారు.

## వంట నూనెలపై భారం తప్పదా...

కొనసాగుతోంది. వంట నూనెలు, ఎరువులు, బంగారం, ముడి చమురు వంటి దిగుమతి చేసుకునే వస్తువులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్న తరుణంలో ఈ చర్చలు జరుగుతున్నాయి. ఈ నెల ప్రారంభంలో వంట నూనెతో సహా దిగుమతి చేసుకునే వస్తువులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ప్రధాని రేంద్ర మోదీ దేశ ప్రజలను కోరారు. అంతేకాదు అనవసరమైన దిగుమతులను అరికట్టేందుకు గత వారం బంగారం, వెండిపై దిగుమతి సుంకాన్ని 15 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. భారతదేశం తన వంట నూనె అవసరాలలో దాదాపు 60% దిగుమతి చేసుకుంటుంది. తద్వారా ప్రపంచంలోనే వంట నూనెల అతిపెద్ద కొనుగోలుదారుగా ఉంది. దిగుమతి సుంకాలలో ఏ పెరుగుదల అయినా ప్రధానంగా ఇండోనేషియా, మలేషియా, అర్జెంటీనా, బ్రెజిల్, రష్యా, యుక్రెయిన్ నుండి దిగుమతి అయ్యే పామాయిల్, సోయాబీన్, సన్ ఫ్లవర్ నూనెల రవాణాను ప్రభావితం చేయొచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఆహార ధరలు వేగంగా పెరుగుతున్న తరుణంలో ఈ ప్రతిపాదన కూడా వచ్చింది. ఇరాన్ సంఘర్షణ సరఫరా గొలుసులకు అంతరాయం కలిగించి వంట నూనెలు, ధాన్యాలు, మాంసం ఉత్పత్తుల ధరలను పెంచింది. ప్రపంచంలో అత్యంత విస్తృతంగా ఉపయోగించే వంట నూనె అయిన పామాయిల్.. సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుండి సుమారు 12% పెరిగింది. పెరుగుతున్న ఇంధన వ్యయాలను భర్తీ చేసుకునే ప్రయత్నంలో భాగంగా ఇండోనేషియా, మలేషియాలో బయో ఫ్యూయల్ ఉత్పత్తి పెరగడం కూడా ఈ పెరుగుదలకు పాక్షికంగా కారణమైంది. అయితే, దిగుమతి సుంకాలను పెంచడానికి భారత్ తీసుకోబోయే చర్య కొనుగోళ్లను నెమ్మదింపజేసి, ఇటీవలి ధరల పెరుగుదలను అదుపు చేయగలదు. కాగా, దిగుమతి సుంకాల పెంపుపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. దేశీయ ధరలను తగ్గించి, ప్రాసెసర్లకు ఉపశమనం కల్పించే ప్రయత్నంలో భాగంగా గత సంవత్సరం ముడి పామ్, సోయాబీన్, సన్ ఫ్లవర్ నూనెలపై ప్రాథమిక దిగుమతి సుంకాన్ని 20% నుండి 10%కి తగ్గించింది కేంద్రం. సుంకం తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని పరిశ్రమను కోరింది ప్రభుత్వం. ఇదిలా ఉండగా, పెరుగుతున్న ముడి చమురు ధరల ఒత్తిడి కారణంగా భారత రూపాయి మరింత బలహీనపడి, సోమవారం అమెరికా డాలర్‌తో పోలిస్తే 96.35 వద్ద రికార్డ్ కనిష్ట స్థాయికి పడిపోయింది.

## మంత్రివర్గ ప్రక్షాళనకు రెడీ

భావిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే అందుకు హైకమాండ్ నుంచి గ్రీన్ సిగ్నల్ అందాల్సి ఉంటుంది. ప్రస్తుత మంత్రివర్గంలో సామాజికవర్గం పరంగా కొందరిని తప్పించాల్సిన పరిస్థితులున్నాయి. అలాగే పనితీరు ఆధారంగా మరికొందరిని బయటకు పంపాల్సిన అవసరం ఉంది. అలాగే 2028 ఎన్నికల్లో పార్టీకిమంచి ఊపు తెచ్చే వారిని ఎంపిక చేసుకుని ముందుకు వెళ్లాలన్న భావనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. ప్రధానమైన వారిని కొందరిని అలాగే ఉంచి జిల్లాల వారీగా కొందరిని మార్చి, కొత్త వారికి అవకాశాలను కల్పిస్తే అందరికీ అవకాశం దొరికినట్లవుతుందని, అప్పుడు అసంతృప్తి, అసహనాలు ఉండవన్న అంచనాలో రేవంత్ రెడ్డి ఉన్నారు. ఈ మేరకే ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా హైకమాండ్ ఎదుట ఈ ప్రతిపాదన పెట్టినా అందుకు హైకమాండ్ సుముఖత వ్యక్తం చేయకపోవడంతో అందుకు సరైన సమయం కోసం వేచి చూస్తున్నారని తెలిసింది.



### ఏసీబీ వలకు జలమండలి అవినీతి తిమింగలం.. రూ.1.10 కోట్ల నగదు, కేజీ బంగారం స్వాధీనం

**హైదరాబాద్ వాటర్ బోర్డ్ జీఎం ఎస్.ఎల్. కుమార్ ఇళ్లపై ఏసీబీ దాడులు**

**సోదాల్లో రూ.1.10 కోట్లకు పైగా నగదు, కేజీ బంగారం, ఆస్తి పత్రాల స్వాధీనం**

**హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో 8 చోట్ల ఏకకాలంలో సోదాలు**

**మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ.100 కోట్లు ఉండొచ్చని అధికారుల అంచనా**

**కుమార్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్న ఏసీబీ అధికారులు**

హైదరాబాద్‌లోని మెట్రో వాటర్ సప్లై అండ్ మురుగునీటి పారుదల బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ)లో భారీ అవినీతి బట్టబయలైంది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న పక్కా ఆరోపణలతో వాటర్ బోర్డ్ రెడ్ హిల్స్ విభాగం జనరల్ మేనేజర్ (జీఎం) ఎస్.ఎల్. కుమార్‌కు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలపై మంగళవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీగా నగదు, బంగారం, ఆస్తి పత్రాలు లభించడంతో అధికారులు సైతం విస్తుపోయారు. ఏసీబీ డీఎస్పీ నేతృత్వంలో హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ సోదాలు జరిగాయి. ఈ రోజు ఉదయం ప్రారంభమైన ఈ తనిఖీల్లో సుమారు రూ.1.10 కోట్లకు పైగా నగదు, కేజీ బంగారు ఆభరణాలు, 2.5 కిలోల వెండి వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు పలు కీలకమైన ఆస్తి పత్రాలను కూడా సీజ్ చేశారు. హైదరాబాద్ మల్లాపూర్‌లోని కుమార్ నివాసంలో నగదును లెక్కించి, బంగారు ఆభరణాలను సీల్ చేస్తున్న దృశ్యాలు కనిపించాయి. ఏసీబీ ప్రాథమిక అంచనా ప్రకారం కుమార్ ఆస్తుల విలువ మార్కెట్‌లో సుమారు రూ.100 కోట్ల వరకు ఉండవచ్చని అనుమానిస్తున్నారు. హైదరాబాద్‌లోని ప్రముఖ గేటెడ్ కమ్యూనిటీలలో మూడు ఫ్లాట్లు, ఆరు ఓపెన్ ప్లాట్లు, నిజామాబాద్ జిల్లాలో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్టు గుర్తించారు. దీంతో పాటు కొన్ని కార్లు కూడా ఆయన పేరు మీద ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం ఎస్.ఎల్. కుమార్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు, ఈ ఆస్తుల వెనుక ఉన్న ఆదాయ వనరులపై లోతుగా ప్రశ్నిస్తున్నారు. ఆయనకు సంబంధించిన బ్యాంకు లాకర్లను కూడా తెరిచి తనిఖీ చేయనున్నారు. గతేడాది డిసెంబర్‌లోనూ రవాణా శాఖకు చెందిన డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్ కేసులో ఏసీబీ సుమారు రూ.100 కోట్లకు పైగా అక్రమాస్తులను గుర్తించిన విషయం తెలిసిందే. ఇప్పుడు వాటర్ బోర్డ్ అధికారి కేసులోనూ అదే స్థాయిలో ఆస్తులు బయటపడటం తెలంగాణలో కలకలం రేపుతోంది. ఈ సోదాలపై పూర్తి వివరాలను ఏసీబీ అధికారులు సాయంత్రం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.



### యుద్ధ ప్రాతిపదికన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల భూ సేకరణ ప్రక్రియ: సీఎం రేవంత్

హైదరాబాద్ : పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీనితో పాటు జిల్లాలోని ఇతర ప్రాజెక్టుల విషయంలో కూడా భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. మంగళవారం నాడు ముఖ్యమంత్రి ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులతో ఎంసీఆర్ హెచ్ఆర్డీలో సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ఈ సందర్భంగా కీలకమైన సూచనలు చేశారు. జిల్లాలోని ప్రాజెక్టుల భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు. పెండింగ్ బిల్లులను చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాజేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

## గ్రేటర్ ఎన్నికలకు గులాబీ ప్లాన్

ఆదేశించారు. అయితే, ఈ ప్రక్రియను మానిటరింగ్ చేసేందుకు బూత్ లెవెల్ ఏజెంట్ల లిస్ట్ ఇవ్వాలని అధిష్టానం ఆదేశించగా, మొత్తం 119 నియోజకవర్గాల్లో 38 నియోజకవర్గాల నుంచి ఇంకా లిస్ట్ అందకపోవడంపై ఇటీవల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న కేటీఆర్.. గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు చెందిన ముఖ్య నేతలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. గులాబీ క్యాడర్ బలంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని స్పష్టం చేశారు. కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, అర్హులైన ఓటర్ల వద్ద అవసరమైన అర్హత పత్రాలు ఉండేలా చూసే బాధ్యతను ఈ బీఎల్ఏలకు అప్పగించారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. గతంలో వరుసగా రెండు సార్లు గ్రేటర్ మేయర్ పీఠాన్ని కూడా దక్కించుకుంది. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ఈ జిల్లాల్లోని ఓటర్లు ఎక్కువగా ప్రభావితం అయ్యే అవకాశం ఉందని భావించి, ముస్లిం మైనారిటీ ఓటు బ్యాంకుపై పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. పాతబస్తీ మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో మైనారిటీలు బీఆర్ఎస్ వైపే నిలిచారు. అందుకే, తమ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోటా, లేని చోటా బూత్ ల వారీగా బీఎల్ఏలను నియమించి సానుకూల ఓట్లను కాపాడుకునేందుకు క్షేత్రస్థాయి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు వేచి చూడకుండా, ప్రజల్లోనే ఉండాలని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జీలను కేటీఆర్ ఆదేశించారు. గ్రేటర్ పరిధిలోని ప్రధాన సమస్యలైన డ్రైనేజీ వ్యవస్థ లోపాలు, తాగునీటి ఎద్దడి, దెబ్బతిన్న రోడ్లు, స్థానిక మౌలిక వసతుల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు... లాంటి వాటిని ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ భవన్ వేదికగా కేటీఆర్ ఈ మొత్తం వ్యవహారాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. దీనితో పాటు, డిజిటల్ పద్ధతిలో ప్రతి ఇంటిని టచ్ చేస్తూ ముమ్మరంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందే వ్యూహాత్మక అడుగులు వేస్తూ, కేడర్‌లో జోష్ నింపుతున్న గులాబీ బాస్ ల చర్యలు గ్రేటర్ రాజకీయాల్లో సరికొత్త వేడిని పుట్టిస్తున్నాయి. రాబోయే మున్సిపల్ పోరులో గ్రేటర్ కోటపై మళ్లీ గులాబీ జెండా ఎగురుతుందో లేదో చూడాలి.

# మౌళిక వసతులను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలి

## బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



కుత్బుల్లాపూర్ మే 19(వాయిస్ టుడే ): పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నిజాంపేట్, బాచుపల్లి, కైసర్ నగర్, దుండిగల్, డి. పోచంపల్లి, బహదూర్‌పల్లి, దేవేందర్ నగర్ ప్రాంతాలకు చెందిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాలలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలపై బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ సంబంధిత శాఖల అధికారులతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హౌసింగ్ బోర్డు, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖ, మున్సిపాలిటీ, ఇంజనీరింగ్ తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొని సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లాడుతూ, పేద ప్రజలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే లక్ష్యంతో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ దూరదృష్టితో సకల సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి వేలాది మంది పేద కుటుంబాలకు అందజేశామని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం ఆ ఇళ్ల సముదాయాల్లో నివసిస్తున్న లబ్ధిదారులకు అవసరమైన కనీస మౌలిక వసతులు సకాలంలో కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతంగా జీవించేందుకు అవసరమైన మౌలిక వసతులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ సరఫరా, వీధిదీపాల ఏర్పాటు, రహదారుల అభివృద్ధి, రవాణా సౌకర్యాల కల్పన వంటి అంశాలను అత్యంత ప్రాధాన్యంతో తీసుకోవాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా రోజుకు రెండు సార్లు తాగునీటిని విడుదల చేసేలా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. విద్యుత్ సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించి, కాలనీల్లో తగినంత వీధిదీపాలను ఏర్పాటు చేయడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద భద్రతా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని సూచించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్న ప్రతి లబ్ధిదారుడికి సొంతింటి భరోసా కలిగించే విధంగా ఇంటి నెంబర్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. సముదాయాల్లో నివసిస్తున్న ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని దేవాలయం, మసీదు, చర్చి వంటి ప్రార్థనా మందిరాల మరియు వైకుంఠ ధామాల నిర్మాణానికి తగిన స్థలాలను కేటాయించాలని అధికారులను కోరారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పరిష్కరించి, డబుల్ బెడ్‌రూమ్ కాలనీలను ఆదర్శవంతమైన నివాస సముదాయాలుగా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ సమావేశంలో నిజాంపేట్, బాచుపల్లి, కైసర్ నగర్, దుండిగల్, డి. పోచంపల్లి, బహదూర్‌పల్లి ప్రాంతాలకు చెందిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొని తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గాజుల రామారం ఉప కమిషనేర్, ఇంజనీరింగ్ శాఖ, హౌసింగ్ బోర్డు, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖ, మున్సిపాలిటీ తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై దుష్ప్రచారం

### -- రాజకీయ కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నాము

### గాజులరామారం ఉషోదయ కాలనీ అధ్యక్షులు దేగల సతీష్ బాబు




కుత్బుల్లాపూర్ మే 19(వాయిస్ టుడే ): కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యతిరేకంగా జరుగుతున్న దుష్ప్రచారాన్ని, రాజకీయ కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నాము. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, తెలంగాణ ప్రజల అభిమాన నాయకుడు బండి సంజయ్ , వారి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న రాజకీయ దుష్ప్రచారాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. ప్రతిపక్షాలు నాయకులు ఒక ప్లాన్ ప్రకారం లేనిపోని నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ప్రచారం ద్వారా రాజకీయ ప్రయోజితమేనని. ఒక వ్యక్తిగత ఘటనను అడ్డుపెట్టుకుని, బండి సంజయ్ సుదీర్ఘ రాజకీయ జీవితానికి మరియు వారి వ్యక్తిత్వానికి మచ్చతెచ్చేందుకు చేస్తున్న ఈ కుట్రలను ప్రజలు గమనిస్తున్నే ఉన్నారు. ఈ క్లిష్ట సమయంలో బండి సంజయ్ వారి కుటుంబానికి మేము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాము.



## కవాడిగూడ తాళబస్తీకి కాంగ్రెస్ డివిజన్‌గా రమేష్ యాదవ్ నియమితులయ్యారు

తన నియామకానికి సహకరించిన వారికి రమేష్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, అర్వింద్ యాదవ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి.. పార్టీ పటిష్టత కోసం మరింత కృషి చేస్తానని రమేష్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.



## వెంకట్ రెడ్డి నగర్ కాలనీలో కొత్త రోడ్డు నిర్మాణం పూర్తి

### ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి

### పరమేశ్వర్ రెడ్డి సహకారంతో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఆకారపు అరుణ్ పటేల్

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వెంకట్ రెడ్డి నగర్ కాలనీ వాసుల దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. కాలనీలోని శ్రీ కన్యకా పరమేశ్వరి గుడి నుండి గాంధీ హైస్కూల్ వరకు నిన్న కొత్త సిమెంట్ రోడ్డు వేయడం జరిగింది. బస్తి బాట సమయంలో కాలనీ సమస్యలను తెలుసుకుని, రోడ్డు వేయిస్తానని మాట ఇచ్చి కాలనీవాసులు మందముల పరమేశ్వర్ రెడ్డి స్వయంగా కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది వెంటనే స్పందించి పరమేష్ రెడ్డి అధికారులతో మాట్లాడి రోడ్డు పనులు తొందరగా కంప్లీట్ చేయాలి అని చెప్పి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. తన మాట ప్రకారం అతి తక్కువ కాలంలోనే నిధులను మంజూరు చేయించి ఈ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయించారు. కేవలం ఆదేశాలు ఇవ్వడమే కాకుండా, నిన్న అరుణ్ పటేల్ రోడ్డు పనులు జరుగుతున్న సమయంలో ఆయనే స్వయంగా దగ్గరుండి పనుల నాణ్యతను పర్యవేక్షించారు. తరలివచ్చిన కాలనీ వాసులు ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు రాగి వెంకటరెడ్డి, శివ గౌడ్, పూజారి సోమయ్య గౌడ్,హరీష్ చారి, మల్లయ్య, యాదగిరి, పొట్టేలు పరమేష్, సత్తయ్య, చోట రాజేష్, కిషోర్, భాను, కృష్ణ, నాగేష్,కాలని యువకులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రోడ్డు నిర్మాణాన్ని తొందరగా పూర్తి చేసినందుకు కాలనీవాసులు ధన్యవాదాలు చెప్పారు.

# ఉప్పల్లో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు కృషి చేస్తాం

### ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి.. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

### వాహనాదారులకు తెలిసేలా స్పష్టమై సైన్ బోర్డులు.. ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం రోజున ఉప్పల్ ఎక్స్ రోడ్ వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్లై ఓవర్ పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వాహనదారులకు స్పష్టమైన మార్గదర్శకత్వం అందించేలా సరైన డైవర్షన్ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నిర్వహణలో సమన్వయం పెంచాలని అధికారులకు సూచనలు చేశారు. ఫ్లైఓవర్ పిల్లర్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. నగర ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం మరియు మౌలిక వసతుల అభివృద్ధిని వేగవంతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోలో ఉప్పల్ జోనల్ కమిషనర్, మెయింటెనెన్స్ చీఫ్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఉప్పల్ మరియు ఎల్బీ నగర్ ట్రాఫిక్ డీసీపీలతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



## డ్రైనేజీ నీరు ఇళ్లల్లోకి చేరుతుంది

### ఇల్లులు ఖాళీ చేసి వెళ్ళిపోతున్న బస్తీ వాసులు

### శ్రీరామ కాలనీలో ఘోరంగా తయారైన పరిస్థితులు

జల్‌పల్లి, మే 19: మహేశ్వరం నియోజకవర్గం జల్పల్లి డివిజన్ శ్రీరామ కాలనీ సాయి బార్ గల్లి బస్తి చివరి గల్లీలో డ్రైనేజీ పొంగి ఇళ్లల్లోకి ప్రవేశిస్తుంది. అధికారులు స్పందించకపోవడంతో బస్తివాసులు ఇల్లులు ఖాళీ చేసి వెళ్ళిపోతున్నారు. జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకోని తమ బాధను తీర్చాలని బస్తివాసులు కోరుతున్నారు. గత వారం రోజులుగా దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నామని బస్తీ వాసులు తెలియజేశారు. జిహెచ్ఎంసి అధికారులకు పలుమార్లు చరవాణి ద్వారా సమాచారం అందించిన ఇప్పటివరకు సమస్య తీరలేదని మరియు కొంతమంది ఇల్లులు ఖాళీ చేసి వెళ్లిపోయారని బస్తీ వాసులు తెలియజేశారు. సమస్యను త్వరగా పరిష్కరించకపోతే జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తామని తెలియజేశారు బస్తీ వాసులు.




## ముదిరాజ్ లేకుండా తెలంగాణ సీఎం ఎవరు కాలేరు: ఐపి గుప్తా

### నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్న ఇండియన్ ఇంక్లూజివ్ పార్టీ

హైదరాబాద్, మే 19: ఇండియన్ ఇంక్లూజివ్ పార్టీ అధినేత ఇంద్రజిత్తు ప్రసాద్ గుప్తా ఆధ్వర్యంలో మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో పార్టీ తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తెలంగాణ ఇన్చార్జ్ డీకే మౌరి సమావేశానికి అధ్యక్షత వహించారు. ఇండియన్ ఇంక్లూజివ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గా మర్రి ప్రభాకర్ ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా చింతల నీలకంఠం ముదిరాజ్, హనుమంతరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బిక్షపతి ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా చింతల శ్రీనివాస్ , అనంతరం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించినటువంటి ప్రతినిధి కోటేశ్వరరావును ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్టు సంఘం ప్రధాన కార్యదర్శి బోయిని శ్రీనివాస్ ముదిరాజ్ , పిట్టల మోహన రాజ్ ముదిరాజ్ బాలస్వామి ముదిరాజ్ కామరపు రాజేందర్ సతీష్ ముదిరాజ్ శ్రీనివాస్ ముదిరాజ్ కర్ణాటక ఐఐపి పార్టీ ఇంచార్జ్ అంబరీష్ ఉప్పల్ శ్రీనివాస్ ముదిరాజ్ జర్నలిస్టు వీరితోపాటు, ఐ ఐ పి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రజల నుండి వినతులను స్వీకరించిన స్థానిక మాజీ శాసనసభ్యులు లికూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ మే 19(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ షాపూర్ నగర్ లోని వారి నివాసంలో నియోజకవర్గానికి సంబంధించిన స్థానిక ప్రజలు పలు సమస్యలపై కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం మరియు అంతర్గత రోడ్లు, డ్రైనేజీ మరియు మంచి నీటి సరఫరా, కాలనీలలో వీధి దీపాలు ( స్ట్రీట్ లైట్స్ ) వంటి ఇతర సమస్యలపై వారిని కలిసి వినతి పత్రాలను అందించారు.వారు తక్షణమే స్పందిస్తూ సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి కొన్నిటిని తక్షణమే పరిష్కరించారు ఈ కార్యక్రమంలో వివిధ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు...



## నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

### కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ

కుత్బుల్లాపూర్ మే 19(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ నియోజకవర్గానికి చెందిన ప్రజలు, కాలనీ సభ్యులు, నాయకులు, అభిమానులు పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు వారు సానుకూలంగా స్పందించారు. వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. గౌరవనీయులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు , ఎమ్మెల్యే కె.పి వివేకానంద దృష్టికి తీసుకెళ్లి వారి సహాయ సహకారాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.. అదే విధంగా పలు కార్యక్రమాలలో పాల్గొనాలని పలువురూ ఆహ్వానించారు.



## ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):– ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో తాగునీటి సరఫరా మురుగునీటి వ్యవస్థల దుస్థితిపై ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ( హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి ) మేనేజింగ్ డైరెక్టర్ పంకజ గారిని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు బగాయత్ లోని కార్యాలయం లో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. నియోజకవర్గంలో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే ఆమోదించి, ప్రాధాన్యత ప్రాతిపదికన నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు.ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా, సక్రమమైన మురుగునీటి పారుదల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.



## రామంతాపూర్ అత్యంత వైభవంగా బీరప్ప కళ్యాణం

### పాల్గొన్న ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి ఆకారపు అరుణ్ పటేల్

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):– రామంతాపూర్ గ్రామంలోని శ్రీ బీరప్ప స్వామి ఆలయంలో బీరప్ప స్వామి – కామరాతి దేవి కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. రామంతాపూర్ గ్రామ కురుమ కుల పెద్దల సమక్షంలో, కురుమల కుల గురువు ఒగ్గ పూజారుల ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ పవిత్ర కళ్యాణ వేడుకలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి,అరుణ్ పటేల్ పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... "కురుమల కులదైవం బీరప్ప స్వామి ఆశీస్సులు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలి. కురుమ సోదరుల ఆత్మీయ ఆహ్వానం మేరకు కళ్యాణంలో పాల్గొనడం నా అదృష్టం. రామంతాపూర్ గ్రామంలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నాను" అని తెలిపారు.

**గ్రామ సంస్కృతి.. మన వారసత్వం**

అందరి దేవుడు.. బీరప్ప స్వామి అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో రామంతాపూర్,వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కురుమ కుల పెద్దలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కళ్యాణాన్ని విజయవంతం చేశారు.

## లులు మాల్‌లో తనిఖీలు.. 150 కిలోల మిఠాయిలు, నూనెలు సీజ్

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్టీయూ రోడ్డులోని లులు మాల్‌లో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఆహారభద్రత విభాగం అధికారుల బృందం నిర్వహించిన తనిఖీల్లో భారీగా లోపాలు వెలుగుచూశాయి. మిక్చర్‌లో బల్లి ఉందని సామాజిక మధ్యమం ఎక్స్ ద్వారా ఫిర్యాదు రాగా ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్లు హృదయ, నిహారిక, భాను ఈ తనిఖీలు చేపట్టారు. తనిఖీలో గుర్తించిన వివరాలను కమిషనర్ ఆఫ్ ఫుడ్ సేఫ్టీ ఎక్స్‌లో వివరించారు. వంట గదుల్లో అపరిశుభ్రత, రిఫ్రిజిరేటర్లలో నిల్వ ఆహార పదార్థాలు, హానికరమైన జీవుల సంచారం, కుళ్లిన కూరగాయలు, ఆహార పదార్థాల పొట్లాలపై నకిలీ లేబుల్స్, శనగపిండిలో పురుగులు, ఆరోగ్యానికి హానిచేసే ఘాటైన వాసనల పదార్థాలు నిల్వ ఉన్నట్లు తనిఖీల్లో గుర్తించారు. సుమారు 150 కిలోల మిఠాయిలు, నూనెలు, పిండి, ధాన్యాలు, ఆహారపదార్థాలను సీజ్ చేశారు. తనిఖీల అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేశామని ఇన్‌స్పెక్టర్లు తెలిపారు.




## హైదరాబాద్ లులు మాల్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

హైదరాబాద్: నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీలో ఉన్న లులు మాల్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. 'మిక్చర్‌లో బల్లి' అంటూ సోషల్ మీడియాలో వైరల్ అయిన నేపథ్యంలో అధికారులు స్పందించారు. పలు ఆహార పదార్థాల్లో పురుగులు గుర్తించారు. ఫ్రిడ్జ్‌లలో ఎక్కువ కాలం ఆహారం నిల్వ ఉంచినట్లు గుర్తించారు. కుళ్లిపోయిన కూరగాయలు, సుమారు 150 కిలోల ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు వెల్లడించాల్సి ఉంది.

# పటాన్‌చెరు నియోజకవర్గంలో ముమ్మరంగా సాగిన మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటన





### ఒకేరోజు రూ.84 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### ప్రతి మున్సిపాలిటీకి రూ.15 కోట్ల భారీ నిధుల విడుదల

పటాన్ చెరు (వాయిస్ టుడే) : పటాన్‌చెరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి నేడు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక ప్రజలు వేలాదిగా తరలివచ్చి మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇస్నాపూర్, ఇంద్రేశం, జిన్నారం, గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీలకు రూ.15 కోట్ల చొప్పున పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. మొత్తంగా నియోజకవర్గవ్యాప్తంగా సుమారు రూ.84 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

అలాగే భానూర్‌లో రూ.8.30 కోట్ల వ్యయంతో విశాఖ పీడబ్ల్యూడీ రోడ్డు నుండి శంకరపల్లి--పటాన్‌చెరు రోడ్డు వరకు కంచర్లగూడెం మీదుగా నిర్మించనున్న బీటీ రోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేశారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ కేజీబీవీలో రూ.60.94 లక్షలు, జిన్నారం కేజీబీవీలో రూ.70.95 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల పనులకు శంకుస్థాపన చేసి, సోలక్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. 1985లో స్వర్గీయ ఇందిరాగాంధీ ఈ ప్రాంతానికి బీడీఎల్, ఓడీఎఫ్ వంటి ప్రతిష్టాత్మక రక్షణ రంగ పరిశ్రమలను తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఆమె సేవలను స్మరించుకుంటూ ఈ ప్రాంతంలో ఇందిరమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సముచితమన్నారు.

భానూర్ కార్మికుల హౌసింగ్ సొసైటీకి స్థల కేటాయింపు చేపడతామని, పటాన్‌చెరు నుండి శంకర్‌పల్లి వరకు 100 ఫీట్ల రహదారి నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత పదేళ్లలో లేని విధంగా ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని, జూన్ 2వ తేదీ నుండి కొత్త పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తామని తెలిపారు. పటాన్‌చెరు కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పటాన్‌చెరు అభివృద్ధికి, ముఖ్యంగా విద్యా మరియు మౌలిక వసతుల రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఒకేరోజు రూ.84 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో TGIIC చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి గారు, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## ఇస్నాపూర్, మునిసిపల్ పరిధిలో 15 కోట్ల రూపాయల నిధులతో ఇస్నాపూర్, పాశంమైలారం, చిట్కుల్ గ్రామాల, అభివృద్ధి

ఐదు గ్రామాలకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి.

పాల్గొన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, టీజీఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, సంబంధిత అధికారులు, నియోజకవర్గ ఇన్చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, స్థానిక చైర్మన్లు, కౌన్సిలర్లు



పటాన్ చెరు (వాయిస్ టుడే) : తెల్లాపూర్ డివిజన్ ఉస్మాన్ నగర్ పరిధిలోగల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన అదనపు తరగతి గది నిర్మాణ పనులకు మంగళవారం రాష్ట్ర కార్మిక శాఖ జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి తో కలిసి శంకుస్థాపన చేసిన పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి . గత పది సంవత్సరాలుగా ఉస్మాన్ నగర్ కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థులు పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచడం పట్ల అభినందనలు తెలిపారు. హాజరైన ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు.





## గీతం విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి 'ఫ్యూచర్ ఎక్స్5'

పటాన్ చెరు (వాయిస్ టుడే) : పరిశ్రమకు సంబంధించిన జ్ఞానాన్ని, భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే నైపుణ్యాలను విద్యార్థులకు అందించడానికి 'ఫ్యూచర్ ఎక్స్5' పేరిట ఒక చైతన్యవంతమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల శ్రేణికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం శ్రీకారం చుట్టింది. గీతంలోని శిక్షణ, మార్గదర్శకత్వం, వృత్తి మార్గదర్శకత్వ డైరెక్టరేట్ (టీఎంసీజీ)లోని శిక్షణ, సామర్థ్య వికాస (టీసీడీ) విభాగం దీనిని ఏర్పాటు చేస్తున్నటు డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. కృత్రిమ మేధస్సు, సైబర్ సెక్యూరిటీ, ప్రాజెక్టు మేనేజ్ మెంట్, క్వాంటం కంప్యూటింగ్, కార్పొరేట్ రెడీనెస్, ఎథికల్ హ్యాకింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల నుంచి అనుభవజ్ఞులైన నిపుణులను తీసుకురావడం ద్వారా విద్య, పరిశ్రమ అంచనాల మధ్య అంతరాన్ని తగ్గించడమే ఈ కార్యక్రమ లక్ష్యంగా డాక్టర్ రోజీనా వివరించారు.

మే 23 నుంచి జూన్ 6 వరకు నిర్వహించనున్న ఈ సెషన్లు, ప్రతివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై ఆచరణాత్మక అవగాహన పొందడం, ప్రముఖ సంస్థల నిపుణులతో సంభాషించడం, ప్రస్తుత మార్కెట్ పోకడలను అర్థం చేసుకోవడం, వారి వృత్తిపరమైన, కెరీర్ సంసిద్ధతను మెరుగుపరచుకోవడం వంటివి చేస్తారని డాక్టర్ రోజీనా తెలిపారు. మే 23న వినియోగదారు సంబంధాల నిర్వహణ (సీఆర్ఎం), ప్రాజెక్టు నిర్వహణలను విల్ కామ్ డెలివరీ మేనేజర్ శశిధర్ కొండూరి పరిచయం చేస్తారన్నారు. మే 30న క్వాంటం కంప్యూటింగ్, భద్రతను ఈవై డైరెక్టర్ మూర్తి పరవశివం వివరిస్తారని తెలిపారు. మే 31న కార్పొరేట్ సంస్కృతిని అర్థం చేసుకోవడం, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, ఉత్పాదకత, స్వీయ బ్రాండింగ్ లపై ఎంఎక్స్4 భాగస్వామి, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ గురుసిద్ధయ్య శిక్షణ ఇస్తారన్నారు. జూన్ 6న నైతిక హ్యాకింగ్ ను లిబరల్ సెక్యూరిటీ వ్యవస్థాపకులు సుజయ్ గంకిడి పరిచయం చేస్తారని డైరెక్టర్ వివరించారు. పరిశ్రమ భవిష్యత్తు పోకడలను అన్వేషించడానికి, వృత్తిపరమైన సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి, అభివృద్ధి చెందుతున్న కెరీర్ రంగాలకు తమను తాము సిద్ధం చేసుకోవడానికి ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఆయా సెషన్లలో చురుకుగా పాల్గొనాలని డాక్టర్ రోజీనా మాథ్యూ సూచించారు.

## సెంట్రింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి పనిబంద్ కొనసాగింపు



నాచారం (వాయిస్ టుడే): నాచారం భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న సెంట్రింగ్ కాంట్రాక్టర్లు ,కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పనిబంద్ కొనసాగుతోంది...కార్మికుల సంక్షేమం, భద్రత, సామాజిక రక్షణ చర్యలు అమలు చేయాలని సంఘం ప్రభుత్వాన్ని కోరింది..అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. పరశురామ్ రెడ్డి, చైర్మన్ యం.డి. చాంద్ పాషా, ప్రధాన కార్యదర్శి సి. విష్ణువర్ధన్ రెడ్డి..

ఉపాధ్యక్షులు ఎన్. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ... భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికులకు కార్మికశాఖ ద్వారా శాశ్వత గుర్తింపు కార్డులు జారీ చేయాలని , 55 సంవత్సరాలు పూర్తిచేసుకున్న కార్మికులకు నెలకు రూ.3,000 పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ వైద్య సేవలు, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.సెంట్రింగ్ మెటీరియల్ దొంగతనాలపై వెంటనే చర్యలు తీసుకుని కేసుల దర్యాప్తు జరపాలని, దొంగిలించిన మెటీరియల్‌ను స్క్రాప్ వ్యాపారులు కొనుగోలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.జీహెచ్ఎంసీ అనుమతి లేని భవనాలను కూల్చివేసే ముందు సెంట్రింగ్ మెటీరియల్ తొలగించేందుకు అవకాశం ఇవ్వాలని , ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు ప్రభుత్వ నష్టపరిహారాన్ని రూ.20 లక్షలకు పెంచాలని కోరారు.ప్రమాదాలకు గురైన కార్మికులకు సంక్షేమ బోర్డు గుర్తింపు కార్డు లేకపోయినా పోలీస్ ఎఫ్ఐఆర్ ఆధారంగా నష్టపరిహారం అందించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఫ్యూచర్ సిటీలో సెంట్రింగ్ సంఘానికి రెండు ఎకరాల స్థలం కేటాయించాలని, నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి సెంట్రింగ్ మెటీరియల్ కొనుగోలుకు బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు అందించాలని కోరారు.

రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సెంట్రింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ రాములు , వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ , సెక్రెటరీ సంతోష్ , ఆర్గనైజర్ దేవేందర్ , మరియు శేఖర్ , ముఖ్య సలహాదారులు శ్రీరాములు , రమేష్ , లక్ష్మణ్ , తదితరులు పాల్గొన్నారు.

# సుందరయ్య ఆశయాలతో వర్గ పోరాటాలకు కొత్త ఊపు ఇవ్వాలి

**- ఎరవెల్లి ముత్యంరావు**
**సిఐటియు జిల్లా కార్యదర్శి**



సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా మే-19 వాయిస్ టుడే : పుచ్చలపల్లి సుందరయ్య నలభై ఒకటవ వర్ధంతి సందర్భంగా సుల్తానాబాద్ రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక పూసాల పెద్దమ్మ గుడి వద్ద సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు, అనంతరం జరిగిన వర్ధంతి సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వీర తెలంగాణ విప్లవ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, ప్రముఖ పార్లమెంటేరియన్ పుచ్చలపల్లి సుందరయ్య ను స్మరించుకోవడం అంటే నేడు భారతదేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థను అర్థం చేసుకొని కార్మిక వర్గ పోరాటాలను ఉదృతం చేయాలని పిలుపునిచ్చారు.

అప్పుడే కార్మిక వర్గశీ ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య భూస్వామ్య అగ్ర కులంలో పుట్టిన తన ప్రజా జీవితంలో వాటన్నింటినీ విసర్జించి బాల్య దశ నుండే కుల వివక్షకు, సామాజిక అణిచివేతకు వ్యతిరేకంగా తన ఊరు, తన కుటుంబం నుండి పోరాటాన్ని ప్రారంభించారని స్వాతంత్ర ఉద్యమంలో గాంధీ, నెహ్రూ లాంటి నాయకులతో కలిసి పాల్గొన్నారని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వీర తెలంగాణ విప్లవ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారని స్వాతంత్రం వచ్చిన తర్వాత పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యలను వెలిగెత్తి చాటారని అన్నారు. తన కుటుంబాన్ని నుండి తనకు ఆస్తిగా వచ్చిన మూడు వందల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచారని, తన పేరులో రెడ్డి అనే పదాన్ని తొలగించి సుందరయ్యగా పేరు మార్చుకున్నారని తనకు పిల్లలు పుడితే తన సమయాన్ని పిల్లలకు వెచ్చించాల్సి వస్తుందని అందుకే పెళ్లికి ముందే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుని ప్రజలే తన కుటుంబం గా భావించిన మహోన్నతమైనటువంటి నాయకుడని అన్నారు. పార్లమెంటుకు సైకిల్ మీద వెళ్లి తన యొక్క నిరాడంబరతను చాటారని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో రాష్ట్ర కార్యదర్శిగా నాయకత్వం వహించారని అనంతరం రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాడి సిపిఎం స్థాపించి నా వారిలో ముఖ్యులని పార్టీ ప్రధాన కార్యదర్శిగా పార్లమెంట్ సభ్యుడిగా శాసన సభ్యులుగా అనేక రూపాల్లో ప్రజా పోరాటాలను చట్టసభల్లో వినిపించారని, అదే సమయంలో ప్రజలను సమీకరించి సమరశీల ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించాలని సమస్త మానవాళి విముక్తికి మార్గం పెట్టుబడిదారి సమాజాన్ని అంతం చేసి కార్మిక వర్గ రాజ్య స్థాపన లక్ష్యంగా కమ్యూనిస్టు పార్టీలు పనిచేయాలని పిలుపునిచ్చిన నాయకుడని అన్నారు. నేడు భారతదేశంలో కార్పొరేట్లు, పెట్టుబడిదారులు కలిపి చేస్తున్న దోపిడిని, కార్మిక వర్గం ఐక్యం కాకుండా కులం, మతం, ప్రాంతం, జాతి పేరుతో చీల్చుతున్న కుట్రలను పసిగట్టి కార్మిక వర్గం చైతన్య యుతంగా ఐక్యంగా సమరశీల పోరాటాలు,ఉద్యమాలు నిర్వహించాలని తద్వారా ఈ పెట్టుబడి దారి సమాజాన్ని నుండి కార్మిక వర్గాన్ని విముక్తి కోసం పోరాడాలని అదే సుందరయ్య గారికి అర్పించే నిజమైన నివ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ సిఐటియు మండల కో కన్వీనర్ మాతంగి రాజమల్లు, రైస్ మిల్ ఆపరేటర్ల సంఘం కార్యదర్శి నౌవుడ్ల బ్రహ్మాచారి, అనంతుల శ్రీనివాస్, సదయ్య, లింగయ్య, రమేష్, ప్రసాద్, మహేష్, సుధాకర్ రావు, కుమార్, సతీష్, శ్రీనివాస్, రాజేశం, ప్రభాకర్, ఓదెలు, కొమురయ్య, మల్లేష్, తిరుపతి, మహేందర్, సంపత్, సురేష్, తదితరులు ఆపరేటర్స్ పాల్గొన్నారు...



## క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్ట నిబంధనలు తప్పనిసరి

### ఆసుపత్రుల్లో సేవల ధరల పట్టిక స్పష్టంగా ప్రదర్శించాలి

### హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి

హనుమకొండ,వాయిస్ టుడే: ప్రైవేట్ క్లినిక్‌లు,డయాగ్నొస్టిక్ సెంటర్లు,ఆసుపత్రులు తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టంలోని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి సూచించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మిని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా రిజిస్టరింగ్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల్లో అందించే వైద్య సేవలు,నిర్వహించే పరీక్షలు,వాటికి వసూలు చేసే రుసుముల వివరాలతో కూడిన ధరల పట్టికను రోగులు,వారి సహాయకులకు స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శక సేవలు అందించేందుకు ఇది అత్యంత అవసరమని పేర్కొన్నారు. అలాగే ఆసుపత్రులు,డయాగ్నొస్టిక్ సెంటర్లు ఇన్ఫెక్షన్ నియంత్రణ చర్యలు,ఫైర్ సేఫ్టీ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. రోగుల భద్రత,ఆరోగ్య పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని ప్రమాణాలు పాటించాలని తెలిపారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య జిల్లాలోని ఆసుపత్రుల్లో నిర్వహించిన తనిఖీలు,జారీ చేసిన నోటీసులు,తీసుకున్న చర్యల వివరాలను కమిటీ సభ్యులకు వివరించారు. జిల్లాలో ప్రస్తుతం 780 ప్రైవేట్ క్లినిక్‌లు,ఆసుపత్రులతో పాటు 118 ప్రభుత్వ డిస్పెన్సరీలు,పల్లె దవాఖానాలు,బస్తీ దవాఖానాలు,ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రాలు,ఆసుపత్రులు నమోదు చేయబడినట్లు తెలిపారు. ఈ సమావేశంలో హనుమకొండ,పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్,డాక్టర్ కన్నం నారాయణ,ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ ముక్క దిలీప్ కుమార్,సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్,స్టాటిస్టికల్ అధికారి జి.ప్రసన్నకుమార్,డెమో వి.అశోక్ రెడ్డి,సురేఖ తదితరులు పాల్గొన్నారు.




## నేడు మడికొండలో ఉచిత పిల్లల వైద్య శిబిరం

### తనయ చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

కాజీపేట, వాయిస్ టుడే: మడికొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో నేడు (బుధవారం) ఉదయం 8 గంటలకు తనయ చిల్డ్రన్స్ హాస్పిటల్,హనుమకొండ ఆధ్వర్యంలో ఉచిత పిల్లల వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో చిన్న పిల్లలకు ఉచిత వైద్య పరీక్షలు,పెరుగుదల తనిఖీలు,పోషణ సలహాలు,ఉచిత మందుల పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పిల్లల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని కాజీపేట,మడికొండ మరియు చుట్టుపక్కల గ్రామాల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మీ పిల్లల ఆరోగ్యం కోసం తప్పనిసరిగా హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

# కోడి పందాల స్థావరాలపై పోలీసుల ఉక్కుపాదం

### 14 మంది అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

### గంజాయి, మత్తు పదార్థాలు, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

### పట్టుబడిన వారిలో మాజీ పోలీస్, ప్రజాప్రతినిధి కుమారుడు కూడా..!

### పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి



సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా మే-19 వాయిస్ టుడే : కోడి పందాల మోజులో పలువురు కటకటాల పాలయ్యారు. వ్యాపారులు, ఉద్యోగస్తులు సైతం కోడి పందాలలో పెద్ద మొత్తంలో డబ్బు వస్తుందని ఆశించి అత్యాశకు పోయి పోలీసులకు చిక్కి చివరకు కటకటాల పాలైన వైనం సర్కిల్ పరిధిలో చోటుచేసుకుంది. మంగళవారం పెద్దపల్లి డిసిపి భూక్య రామ్ రెడ్డి సుల్తానాబాద్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఎలిగేడు మండలం శివ పల్లి గ్రామంలోనీ బోడగుట్ట వద్ద రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరాలపై పెద్దపల్లి ఏసిపి జి,కృష్ణ ఆధ్వర్యంలో సుల్తానాబాద్, పెద్దపల్లి సిఐలు పొన్నమనేని రంజిత్ రావు, కె ప్రవీణ్ ల సారథ్యంలో పోలీసులు ఆకస్మిక మెరుపు దాడి నిర్వహించి పద్నాలుగు మందిని అదుపులోకి తీసుకున్నామని డీసీపీ తెలిపారు. పట్టుబడిన వారిలో మాజీ పోలీస్ సైతం ఉన్నట్లు వివరించారు. కోడిపందాల ప్రధాన సూత్రధారి ఓ తాజా ప్రజా ప్రతినిధి కుమారుడు ఎలిగేడు మండలం శివపల్లి గ్రామానికి చెందిన దుగ్యాల కార్తీక్ రావు సారథ్యంలో అదే గ్రామానికి చెందిన ఓజ్జ శంకర్, పొన్నాల రాజు, పెద్దపల్లికి చెందిన బత్తుల రాజు, మందమరి మండలం గుడిపల్లి కి చెందిన సల్లూరి పవన్, ఇందారం కు చెందిన గడ్డం రాజేష్, గోదావరిఖని కి చెందిన పొట్లపల్లి మనోహర్ ఎండి రహీం, ఇందారం కు చెందిన పెన్నా రవీందర్, వేల్పుల సతీష్, పెద్దపల్లికి చెందిన పులి నాగరాజు, రామగిరి కి చెందిన కొల్లూరి మహేష్, జైపూర్ మండలం టేకుమట్ల కు చెందిన ఎండి సమాధు, పెద్దపల్లికి చెందిన సింగారపు అఖిల్ వర్మ, లను అదుపులోకి తీసుకున్నామని వారి వద్ద నుండి పదమూడు మొబైల్ ఫోన్స్, నలభై వేల రూపాయల నగదు, ఏడు ద్విచక్ర వాహనాలు, ఒక ఎర్టిగా కారు, ఆరు కోళ్లను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని తెలిపారు మరి కొంతమంది పరారీలో ఉన్నారని వివరించారు. గతంలో వైద్య శంకర్, ఎండి రహీం, వేల్పుల సతీష్, పొన్నాల రాజు లపై వివిధ పోలీస్ స్టేషన్లలో కోడి పందాల కేసులు నమోదై ఉన్నాయని వివరించారు. అనంతరం మాట్లాడుతూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడిన ఉపేక్షించేది లేదని మత్తు, గంజాయి లాంటివి విక్రయిస్తే ఉక్కు పాదంతో అణిచివేస్తామని శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకునేది లేదని మూగజీవాలను హింసించడం చట్టరీత్యా నేరమని సాంప్రదాయాల పేరుతో చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకుండా దూరంగా ఉండాలని సూచించారు. చట్ట విరుద్ధ కార్యక్రమాలు ఎక్కడ నిర్వహించిన వందకు డయల్ చేయాలని లేదా స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి, బసంత్ నగర్ ఎస్సైలు చంద్రకుమార్, మధుకర్, సన్నత్ రెడ్డి, శ్రీధర్, నరేష్, లతోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందిని అభినందిస్తూ రివార్డులు అందించనున్నట్లు డిసిపి తెలిపారు.



## పుచ్చలపల్లి ఆశయాలు కొనసాగిద్దాం

### సుందరయ్య వర్ధంతి సందర్భంగా మజ్జిగ వితరణ

తొర్రూరు, మే 19 వాయిస్ టుడే : ఆదర్శమూర్తి, దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను నేటి యువత కొనసాగించాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్ అన్నారు. మంగళవారం పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా తొర్రూరు పట్టణ కేంద్రంలో ఆయన చిత్రపటానికి సీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది. అనంతరం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా మజ్జిగ వితరణ కార్యక్రమం కామ్రేడ్ శ్రీరంగం రాధా రామకృష్ణ ల సౌజన్యంతో చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బొల్లం అశోక్ మాట్లాడుతూ, భారతదేశంలో పేద మధుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిత్యం పనిచేసిన మహానీయుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని వారు అన్నారు. సుందరయ్య ఉన్నత కుటుంబంలో జన్మించి, నిత్యం కూలీలు కార్మికులు బలహీన వర్గాల అప్పుల కోసం నిత్యం పోరాటం చేసేవారని వారు అన్నారు. సమాజ సేవకు పిల్లలు ఉంటే ఆటంకం అని పిల్లలను కూడా కనకుండా సమాజం కోసమే భార్యాభర్తలిద్దరి వారి జీవితాన్ని త్యాగం చేశారని వారు అన్నారు. వారు దేశంలోనే మొదటి పార్లమెంటు ప్రతిపక్ష నేతగా ఉన్నా కూడా, సైకిల్ పైనే పార్లమెంటుకు వెళ్లేవారు ఇలాంటి నిరాడాభరమైన జీవితాన్ని గడిపిన మహా నాయకుడు సందర్భంగా అన్నారు. ఆయన 41వ వర్ధంతి సందర్భంగా తొర్రూరు పట్టణంలో కామ్రేడ్ శ్రీరంగం రాధ రామకృష్ణ సౌజన్యంతో మంగళవారం రోజు సంతకు వచ్చిపోయే ప్రజలకు దప్పిక తీర్చేందుకు మధ్యాహ్నం ఎండలో చల్లని మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రజలందరికీ మజ్జిగ పంచడం జరిగింది. ఈ కార్యక్రమం ఎండ సమయంలో ఏర్పాటు చేయడం వల్ల ప్రజలందరూ హర్షం వ్యక్తం చేశారు. సుందరయ్య జీవితం ఇప్పుడు ఉన్నటువంటి ప్రజలు యువత ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాలను కొనసాగించాలని ఈ సందర్భంగా వారు అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ టౌన్ కార్యదర్శి జమ్మల శీను, యాకయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎండి అమీర్ ,వరలక్ష్మి, కొండ రాము, రేవూరి శ్రీను, సత్యం, మమత, షమీనా భాగ్య, యాక లక్ష్మి, చేన్నమ్మ, ఐలమ్మ, దుండి కృప, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## బడిబాట కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి

### ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరగాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

### బడిబాట కార్యక్రమ నిర్వహణపై డీఈవో, ఎంఈవోలతో కలెక్టర్ సమీక్ష

హనుమకొండ,వాయిస్ టుడే: జిల్లాలో బడిబాట కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్యను గణనీయంగా పెంచాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 16వ తేదీ నుంచి జూన్ 19 వరకు నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమాల పురోగతిపై జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్,మండల విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు కనీసం పది శాతం పెరిగేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. గ్రామస్థాయిలో సర్పంచులు,వార్డు సభ్యులు, మండల అధికారులు,మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులను బడిబాట కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు,సురక్షిత వాతావరణం కల్పిస్తున్న విషయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని అన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో గతంలో మూతపడిన ప్రభుత్వ పాఠశాలలను ఈ విద్యా సంవత్సరం నుంచి తిరిగి ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా నమోదు తక్కువగా ఉన్న పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి,గ్రామాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ప్రభుత్వం ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ అందిస్తున్నందున అర్హులైన ప్రతి విద్యార్థికి ఈ సౌకర్యం చేరేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామాల్లో ఉన్న ప్రతి చిన్నారి విద్యాభ్యాసంలో భాగస్వామి కావాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు,పంచాయతీ కార్యదర్శులు,అంగన్వాడీ టీచర్లు సంయుక్తంగా ఇంటింటి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో భవనాలకు రంగులు వేయడం,పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తి చేయడం వంటి చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా యూడైస్ నిబంధనల ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల అర్హతలు,అనుమతులు,ఫీజుల నిర్మాణం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అన్న విషయాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని డీఈవో,ఎంఈవోలను ఆదేశించారు. జిల్లాలో కొనసాగుతున్న జనగణన కార్యక్రమంలో ఎన్యూమరేటర్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు గృహాల లెక్కింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్,ఏఎంఓ డాక్టర్ మన్మోహన్,బడిబాట కార్యక్రమ కమ్యూనిటీ కోఆర్డినేటర్ సుమా,జీసీఈవో సునీత,జిల్లాలోని 14 మండలాల ఎంఈవోలు,పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వాయిస్
హైదరాబాద్
బుధవారం 20 మే 2026

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ఇక రాజీ లేదు

### ప్రభుత్వానికి టిడబ్ల్యూజేఎఫ్ తుది హెచ్చరిక

ఖమ్మం కార్పొరేషన్, మే 19( వాయిస్ టుడే) : జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం ఇకనైనా స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ జ్వాలలు రగులుతాయని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్-హెచ్ 2843) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం దక్కే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వాన్ని ముందుగానే అప్రమత్తం చేసిన సంఘటన తమ ఫెడరేషన్ ఆధ్వర్యంలోనే జరిగిందని వారు పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల కేటాయింపులో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే ఇక ఉద్యమం తప్పదన్నారు. త్వరలో జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులకు అల్టిమేటం జారీ చేసి, స్పష్టమైన కార్యాచరణ కోరనున్నట్లు తెలిపారు.

కలం పట్టిన చేతులు ఇక ఉద్యమ జెండా ఎత్తుకుంటాయి అంటూ నాయకులు హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించకపోతే పెన్‌డౌన్, భారీ నిరసన ర్యాలీలు, ధర్నాలు, మండల కేంద్రాల నుంచి హైదరాబాద్ వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను తమ ఫెడరేషన్ ఎట్టి పరిస్థితుల్లో సహించదన్నారు. ఇప్పటి వరకు గాంధేయ మార్గంలో వినతిపత్రాలు, శాంతియుత నిరసనలు చేపట్టామని, కానీ ప్రభుత్వ వైఖరిలో మార్పు కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి అర్హులైన ప్రతి జర్నలిస్టు హక్కు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జర్నలిస్టుల ఇళ్ల కల నెరవేరే దాకా ఉద్యమం ఆగదు అని వారు తేల్చిచెప్పారు.



## దళిత మహిళపై దౌర్జన్యం నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### జిల్లా ఎస్పీకి మాల మహానాడు వినతి

### గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ప్రాథమిక విచారణ

కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే): కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం లంకపల్లి గ్రామంలో దళిత మహిళ బెజవాడ వెంకటేశ్వరమ్మపై కులం పేరుతో దూషణలకు దిగి, వేధింపులకు గురిచేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం చేయాలంటూ సోమవారం ఆయన జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై జిల్లా ఎస్పీ తక్షణమే స్పందించి, సమగ్ర విచారణ జరపాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఇరువర్గాల విచారణ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం గన్నవరం పోలీస్ స్టేషన్‌లో సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో ఇరువర్గాలను పిలిపించి ప్రాథమిక విచారణ జరిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. లంకపల్లి ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు వేగవంతం చేశామని, మరో రెండు రోజుల్లో విచారణ ముగించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

### న్యాయం జరిగే వరకు పోరాటం: గోగులమూడి రాజు

ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు మాట్లాడుతూ.. బాధితురాలికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు, నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడే వరకు మాల మహానాడు తరఫున తమ పోరాటాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దళితులపై ఇటువంటి దాడులు, దూషణలకు పాల్పడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.



## గ్రీన్ ఫీల్డ్ హైవే నీ సందర్శించిన ఏసీపి సారంగపాణి

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టేలా ఏ సిపి ఎస్ సారంగపాణి

జాతీయ రహదారిపై ప్రమాదాలు నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు.ఎసిపి ఎస్ సారంగపాణి పేర్కొన్నారు. మంగళవారం జాతీయ రహదారిపై పర్యటించి ఆయన మాట్లాడారు. ప్రమాదం జరిగితే తక్షణమే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని ఎక్కడ ప్రమాదం జరిగిన జాతీయ రహదారిపై అత్యవసర ఫోన్ నెంబర్లు సీసీ కెమెరాలు వంటివి ఏర్పాటు చేసి ఉన్నాయని వాహనదారులు ప్రయాణికులు తక్షణమే స్పందించాలని పేర్కొన్నారు. కల్లూరు మండలం లింగాల ఎగ్జిట్ నుండి వైరా మండలం సోమవారం ఎగ్జిట్ పాయింట్ వరకు ఆయన పర్యటించి ప్రత్యేక సిబ్బంది, ప్రయాణికులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు.ఆయన వెంట సిఐ వెంకటప్రసాద్, ఎస్సై రామారావు, జాతీయ రహదారి అధికారులు రాకేష్, తదితరులున్నారు.

# దేశంలో విద్వేష రాజకీయాలను తిప్పికొట్టాలి

### - సుందరయ్య 41వ వర్ధంతి సభలో నున్నా



ఖమ్మం, మే 19 ( వాయిస్ టుడే) స్థానిక సుందరయ్య భవనంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆర్.ప్రకాష్ అధ్యక్షతన దక్షిణ భారత కమ్యునిస్ట్ ఉద్యమ నిర్మాత, పేదల పెన్నిధి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి జరిగింది. మొదట సుందరయ్య విగ్రహానికి సిపిఎం జిల్లా కార్యదర్శి సున్నా నాగేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా విప్లవజోహార్లు అర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ట్రంప్ కు మోడీ దాసోహమైనట్లు అనిపిస్తుందని అన్నారు.యుద్ధాల పేరుతో కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగినప్పుడు ఇంధన ధరలను పెంచుతున్న ప్రభుత్వం, తగ్గినప్పుడు మాత్రం ధరలను తగ్గించడం లేదని, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల ప్రభావంతో రవాణా ఖర్చులు అధికమై నిత్యావసర సరుకుల ధరలు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. మోడీ 5 రాష్ట్రల ఎన్నికల జరుగుతున్న నేపథ్యంలో ధరలు పెంచని కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల అయిపోయిన తర్వాత పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచటం చొచనియమన్నారు, దేశంలోని ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని మోదీ ప్రజలకు పిలుపు నివటం సిగ్గుచేటు అన్నారు.దేశం లోని కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ అనేక దేశ పర్యటనలు మోడీ చేస్తున్నారని ఆరోపించారు.

దేశంలో నెలకొన్న విద్వేష రాజకీయాలను తిప్పికొడుతూ, సామరస్య జీవనాన్ని కాపాడటమే సుందరయ్యకు మనమిచ్చే నిజమైన నివాళి అవుతుందని అన్నారు. పార్టీ విధానం పట్ల వినయ విధేయతలు, నిరాడంబర జీవితం, ఎల్లప్పుడూ కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండటం వలన సుందరయ్య అత్యుత్తమ కమ్యూనిస్టు నాయకుడయ్యాడని అన్నారు. ప్రజల మనిషిగా, ప్రజల కోసం చివరి వరకూ జీవించి ప్రజా పోరాటాలకు ప్రాధాన్యతనివ్వడంతోపాటు, సామాజిక పోరాటాలకు, సేవా కార్యక్రమాలకు కూడ అంతే ప్రాధాన్యతను సుందరయ్య ఇచ్చాడని అన్నారు. శ్రమను గౌరవించే సమాజం ఏర్పాటుకు అవిరళ కృషి చేసారని, స్త్రీలను కించపర్చడం, కులాధిక్యత భావాలను ఉపయోగించుకొని దళితులను, బలహీనవర్గాలను పీడిరచే చర్యలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారన్నారు. ఎమర్జెన్సీ సమయంలో పార్టీని, కార్యకర్తలను కాపాడుకోవటంలో వివిధ ఎన్నికల సందర్భంగా వచ్చిన ప్రతికూల ఫలితాలలో సైతం కార్యకర్తలను నిలబెట్టడంలో సుందరయ్య కీలకపాత్ర పోషించారన్నారు. మార్క్సిజం పట్ల ఎంచుకున్న లక్ష్యం పట్ల సుందరయ్య స్పష్టతతో వుండి ఉద్యమాన్ని నిర్మాణం చేశారన్నారు. పార్టీని, ప్రజా సంస్థలను, సంఘాలను పోరాట కార్యక్రమాలతో పాటు, ప్రజాసంక్షేమం, సేవా కార్యక్రమాలు చేయాలని, సుందరయ్య చూపిన బాటలో పయనం చేయాలని కోరారు. కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మారుస్తూ దళితులపైన, మైనార్టీలపైన దాడులు చేస్తున్నదని అన్నారు. దేశానికి మతతత్వ రాజకీయాలు చేటు అని ఆరోజే చెప్పారని, నేడు దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రతి అంశాన్ని, చివరకు ఉగ్రవాద దాడులను కూడా మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్నాయని, రాబోయే కాలంలో ప్రజా సమస్యలపై ఉద్యమాలను నిర్మించటమే సుందరయ్యకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.

# సుందరయ్య స్ఫూర్తితో మతోన్మాదంపై మహత్తర పోరాటాలు నిర్మించాలి

### మచ్చలేని మహనీయుడు సుందరయ్య

### సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు




సూర్యాపేట: కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత పనిగట్టుకునిమత విద్వేషాలను పెంచుతుందని పేదల ఐక్యత కోసం సుందరయ్య స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 41 వ వర్ధంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రదర్శన నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగానికి నిలువెత్తు నిదర్శనం ఆదర్శాలలో ఎవరెస్టు శిఖరమైన దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి స్ఫూర్తితో నేటి తరం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఆదర్శవంతమైన విలువలతో రాజకీయాలు చేయడం కమ్యూనిస్టులకే సాధ్యమని దీనికి సుందరయ్య గారి జీవితమే ఆదర్శమని అన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ భూస్వామ్య పెత్తందారి విధానాలకు వ్యతిరేకంగా చిన్ననాటి నుండే పోరాటం చేసిన మహా నాయకుడిని అన్నారు. తెలంగాణలో భూస్వామ్య జమీందారీ రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం సాగించడంలో కీలకపాత్ర వహించారని, వ్యవసాయ కార్మికులకు కూలీ పెరగాలని, భూమి పంచాలని సంఘం పెట్టి కూలి,భూమి పోరాటాలు చేశారని వారు అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం 29కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడలు తీసుకొచ్చి కార్మికుల పొట్టలు కొట్టి కార్పొరేట్ల బొజ్జలు నింపడానికి ప్రయత్నిస్తుందన్నారు మత విద్వేషాలే తప్ప మనుషుల బాగోగులు పట్టడం లేదన్నారు దళితులు గిరిజనులు బలహీన వర్గాలపై దాడులు పెంచడం ద్వారా బిజెపి తన పబ్బం గడుపుకుంటుందని చెప్పారు మతోన్మాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పేదలు కష్టజీవుల ఐక్యత సాధించడమే సుందరయ్యకు అర్పించే నివాళి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరి రావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు కోట గోపి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పులుసు సత్యం, ఎల్గూరి గోవింద్, మద్దెల జ్యోతి, మేకన బోయిన శేఖర్, సిపిఎం వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయికుమార్, సిపిఎం నాయకులు చిన్నపంగా నరసయ్య, మేకన బోయిన సైదమ్మ, మామిడి సుందరయ్య, అబ్బ గాని బిక్షం, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర క్యాబినెట్‌లో ఇళ్లస్థలాలపై ఆమోదం తెలపాలి

### ఆకుతోట ఆదినారాయణ

ఖమ్మం, మే 19( వాయిస్ టుడే): జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణి జర్నలిస్టు వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ఉన్నాయని, గత ప్రభుత్వం క్యాబినెట్ లో 23.2 ఎకరాల భూమిని ఖమ్మం జర్నలిస్టులకు కేటాయిస్తూ జీవో జారీ చేశారని , కానీ వాటిని అమలు చేయడంలో నేటి పాలక పక్షాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టీజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖమ్మం ప్రెస్ క్లబ్ నుంచి మయూరి సెంటర్ మీదుగా అమరవీరుల స్తూపం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద జర్నలిస్టులు నివాళులు అర్పించిన అనంతరం జరిగిన సభలో టి యు డబ్ల్యూ జె (టి జె ఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ... జర్నలిస్టుల సమస్యలు పరిశీలిస్తామని అనేక వాగ్దానాలు చేసిన నేటి పాలకులు అధికారంలోకి వచ్చాక జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ద్వంద వైఖరి అవలంబించడం బాధాకరం అన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా జర్నలిస్టులకు కేటాయించిన 23.2 ఎకరాల భూమిని హౌసింగ్ సొసైటీ ద్వారా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో కాలయాపన చేయడం మంచిది కాదన్నారు. ఈనెల 21న జరిగే క్యాబినెట్ సమావేశంలో సరైన నిర్ణయం తీసుకొని జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు వచ్చే విధంగా ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అనేక చీకటి జీవోలు జారీ చేస్తూ కోత విధించే విధంగా వ్యవహరించడం సరైంది కాదు అన్నారు.




ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు రామిశెట్టి విజేత, జిల్లా ఉపాధ్యక్షులు మందుల ఉపేందర్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కి గోపి, నగర ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా వీడియో గ్రాఫర్స్ అధ్యక్షులు నాగరాజు,ఎలక్ట్రానిక్ మీడియా నగర కార్యదర్శి కె .అశోక్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు పానకాలరావు, ముత్యాల కోటేశ్వరరావు, రేపాక యాదగిరి, పులి శ్రీను ,మూల జీవన్ రెడ్డి, నాయకులు మురళి, నరేష్, నల్లమోతు శ్రీను, ఉల్లోజు రమేష్, జక్కుల వెంకటరమణ, హుస్సేన్, ఈసంపల్లి వెంకటేశ్వర్లు, అప్పారావు, శ్రీధర్, ఎన్ రమేష్, సాయి, రామకృష్ణ, తోట గణేష్, పెంటి వెంకటేశ్వర్లు, ఉత్కంఠం శ్రీనివాస్, మహిళ జర్నలిస్ట్ రోజా, రవీందర్ ,నాయుడు, వేణుగోపాల్, శేఖర్, మధు, సుధాకర్, బాబు, లింగయ్య, సతీష్ ,మహేష్, నరసింహారావు, నాగేశ్వరరావు, గుండు శ్రీను, వెంకటేష్ ,తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పర్యాటక రంగాన్ని ప్రపంచానికి చాటేలా 'ఇన్‌ఫ్లుయెన్సర్ కాంపిటీషన్'

**మే 21న ప్రత్యేక సమావేశం.**

**పోటీల్లో గెలిచిన వారికి ఆకర్షణీయమైన నగదు బహుమతులు**

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



హనుమకొండ జిల్లా (వాయిస్ టుడే): హనుమకొండ జిల్లా పర్యాటక రంగాన్ని ప్రపంచానికి చాటేలా ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్ నిర్వహించడం జరుగుతుందని.. మే 21 తేదీ గురువారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ లో మీడియా ప్రతినిధులు, ఇన్‌ఫ్లుయెన్సర్‌లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని.. పోటీలలో గెలుపొందిన వారికి ఆకర్షణీయమైన నగదు బహుమతి అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లా పర్యాటక శోభా,ప్రాముఖ్యత ప్రపంచానికి చాటి చెప్పేలా 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాలలో భాగంగా వినూత్నంగా ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్ నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ పోటీలలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇన్‌ఫ్లుయెన్సర్,మీడియా ప్రతినిధులు,సోషల్ మీడియా హ్యాండలర్స్ పాల్గొనవచ్చు. ఆసక్తి కలిగిన వారు హనుమకొండ జిల్లా పర్యాటక ప్రాంతాల పై గల 4కె వీడియో లను మే 21 నుండి 30 తేదీ శనివారం సాయంత్రం 5 గంటల లోపు హనుమకొండ జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయం లో వారి సొంత పెన్ డ్రైవ్ ద్వారా సమర్పించవచ్చు అని తెలిపారు. ఆన్లైన్ ద్వారా 4కె వీడియోలు సమర్పించే వారు డిపిఆర్ఓ హనుమకొండ కి పంపించాలన్నారు.

**పోటీ నిబంధనలు గడువు.**

మే 21 నుండి మే 30 వరకు ఇన్‌ఫ్లుయెన్సర్లు హనుమకొండ జిల్లా పర్యాటకం,చరిత్ర,హెరిటేజ్,సంస్కృతిపై రీల్స్ చేసి సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మొదటి మూడు స్థానాలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. మొదటి బహుమతి 15000, ద్వితీయ బహుమతి 10000, తృతీయ బహుమతి 5000 సెప్టెంబర్ 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విజేతల వివరాలను అధికారికంగా ప్రకటించడం జరుగుతుందని,బహుమతులు రాని రీల్స్ అయినప్పటికీ కంటెంట్ బాగుంటే వాటిని సదరు ఇన్‌ఫ్లుయెన్సర్ల పేర్లతో సహా జిల్లా అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్ లో కొలాబరేషన్ ద్వారా పబ్లిష్ చేయడం జరుగుతుంది. ఈ పోటీల నిర్వహించడం వల్లన హనుమకొండ పర్యాటక ప్రాంతాలకు,క్రియేటర్లకు మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. హనుమకొండ జిల్లా, పరిసర ప్రాంతాలలోని సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు,కంటెంట్ క్రియేటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.



## తెలంగాణ సాయుధ పోరాటానికి మార్గదర్శి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య

**సిపిఎం మండల కార్యదర్శి పోసనబోయిన, హుస్సేన్**

హుజూర్ నగర్, మే, 19 (వాయిస్ టుడే ప్రతినిధి): హుజూర్నగర్ మండల పరిధిలోని అమరవరం గ్రామంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది ఈ సందర్భంగా మండల కార్యదర్శి హుస్సేన్ మాట్లాడుతు తెలంగాణ సాయుధ పోరాటానికి మార్గదర్శి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని నిజాం నిరంకుశ పాలనకు భూస్వాముల ఎట్టి చాకిరి వ్యవస్థకు వ్యతిరేకంగా దున్నేవాడికే భూమి నినాదంతో రైతాంగాన్ని సమీకరించి 1946 నుండి 1951 వరకు సాగిన పోరాటంలో అజ్ఞాత జీవితం గడిపిన ఆశయాలను విడిచిపెట్టలేదు రజకారుల అరాచకాలకు ఎదురొడ్డి బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచారు వేలాది మంది యోధుల త్యాగాలతో సాగిన ఆ పోరాటం నిజం రాచరికన్ని కుదిపేసింది ఆ ఉద్యమ అనుభవాలతో ఆయన రాసిన వీర తెలంగాణ విప్లవ పోరాటం గుణపాటాలు గ్రంథం ఇప్పటికీ ఉద్యమకారులకు మార్గదర్శమన్నారు ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు షేక్, సైదా శాఖ సభ్యులు తేనె, సీతారాములు కందుల, వీరస్వామి సానుభూతిపరులు కొప్పుల, నాగిరెడ్డి జిట్ బోయిన, రామయ్య కనుకుంట్ల, మేర కందుల, సీతారాం రెడ్డి బొమ్మ కంటి.శ్రీను,నరేష్ తేనె,గోపీచంద్ జిట్టబోయి, ఎంకన్న ,సైదులు తదితరులు పాల్గొన్నారు.



## బోగ్గుల కుంట తండాలో ఘనంగా మహంకాళి దేవి జాతర నిర్వహణ

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో మే 19 (వాయిస్ టుడే): కామారెడ్డి జిల్లా పిట్లం మండలం బోగ్గుల కుంట తండాలో శుక్రవారం మహంకాళి దేవి జాతరను తండా ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మహంకాళి (కాలిక దేవి) మాత మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడంతో ఆలయ పరిసరాలు భక్తి వాతావరణంతో నిండిపోయాయి. జాతర సందర్భంగా ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో తండాలో పండుగ వాతావరణం నెల కొంది. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్ నాయక్ మరియు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ ఫార్మసీలకు వ్యతిరేకంగా కెమిస్టుల బంద్ పిలుపు



ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో మే 19 (వాయిస్ టుడే): పిట్లం మండలంలోని కెమిస్ట్ సోదరులు ఆన్‌లైన్ ఫార్మసీ వ్యాపారాలకు స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా అసోసియేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ ఆధ్వర్యంలో మందుల దుకాణాలు బంద్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో బుధవారం (20-05-2026) రోజున మందుల దుకాణాలు మూసివేసి సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు అంబేద్కర్ చౌరస్తా వద్ద అందరూ సమావేశమై నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కెమిస్టులు కోరారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తప్పక హాజరై సంఘీభావం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.




## మంచిర్యాల జిల్లా హ్యూమన్ రైట్స్ కార్యవర్గ సమావేశం

మంచిర్యాల, మే 19: ఆల్ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం మంగళవారం జిల్లా అధ్యక్షులు బెజ్జాల ఆనంద్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథులుగా నేషనల్ అధ్యక్షులు డాక్టర్ సురేష్ కుమార్, హ్యూమన్ వింగ్ నేషనల్ చైర్మన్ ఫిలోమిన, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి సతీష్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి సాబీర్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు గాజుల శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి సాగర్, మంచిర్యాల జిల్లా మహిళా ఉపాధ్యక్షులు మద్రి అపూర్వ, మహిళా సెక్రెటరీ మహమ్మద్ జహీదా తదితరులు పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి 200 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నేషనల్ చైర్మన్ సురేష్ మాట్లాడుతూ.. పలు హక్కుల గురించి అవగాహన సదస్సు గురించి మాట్లాడటం జరిగింది. చట్టాల గురించి పోక్స్ చట్టం, మహిళలపై జరుగుతున్న అన్యాయాల గురించి అవగాహన కల్పించారు. సమావేశానికి హాజరై విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.



## గౌరారంలో ఉపాధి హామీ పనుల పరిశీలన

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో మే 19 (వాయిస్ టుడే): కామారెడ్డి జిల్లా పిట్లం మండలం గౌరారం గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను టెక్నికల్ అసిస్టెంట్ తుకారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల నాణ్యత, కొలతలు, పురోగతిని పరిశీలించి కూలీలకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ అంజగౌడ్, గ్రామపంచాయతీ కార్యదర్శి బి. లక్ష్మణ్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



## హిజ్రాలు డబ్బుల కోసం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

**హుజూర్ నగర్ సీఐ చరమందరాజు**

హుజూర్ నగర్, మే, 19, (వాయిస్ టుడే ప్రతినిధి): హిజ్రాలు డబ్బుల కోసం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ చరమందరాజు అన్నారు. మంగళవారం హుజూర్ నగర్ సర్కిల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సిఐ చరమందరాజు, ఎస్ఐ సిహెచ్ నరేష్ హుజూర్ నగర్ పరిధిలో ఉన్నటువంటి ట్రాంజెండర్స్ అందరినీ పోలీస్ స్టేషన్ కు పిలిపించి వారికి తగు సూచనలు చేసి హెచ్చరించారు. హిజ్రాలు ఇకముందు ఎక్కడ వాహనదారులను ఆపి డబ్బులు వసూలు చేయడం గాని, నూతన గృహప్రవేశాలు జరుగుతున్నప్పుడు, పెళ్లిళ్లు జరుగుతున్నప్పుడు, ఇతర శుభకార్యం జరుగుతున్నప్పుడు వారి వద్దకు వెళ్లి ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. అలాకాకుండా ఎవరినైనా ఈ విషయాల్లో ఇబ్బందులకు గురి చేసినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హిజ్రాలు ఎవరైనా శుభకార్యం నందు డబ్బుల కొరకు ప్రజలను వేధింపులకు గురిచేసినట్లైతే పోలీసు వారికి తెలియజేయాలని కోరారు.



## జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హుజూర్ నగర్ ఎస్ ఐ, నరేష్‌కి ఘన సన్మానం

హుజూర్ నగర్, మే 19, (వాయిస్ టుడే ప్రతినిధి): హుజూర్ నగర్ నూతన ఎస్ఐ గా బాధ్యతలు స్వీకరించిన చలికంటి నరేష్ ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోమంగళవారం హుజూర్ నగర్ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షు లు ధూళిపాల శ్రీనివాసరావు, హుజూర్ నగర్ పట్టణ అధ్యక్షులు బొడ్డు గోవిందరావు ప్రధాన కార్యదర్శి శెట్టి శ్రీనివాసరావు, రాయల వెంకటేశ్వర్లు, మహిళా పట్టణ ప్రధాన కార్యదర్శి రావినూతల ఇందిరా, మేళ్లచెరువు గ్రామ అధ్యక్షుడు పసుపులేటి రామారావు, జెల్లా నారాయణ, కుమ్మరి కుంట్ల వెంకట్ నారాయణ, మేళ్లచెరువు బీసీ సంక్షేమ సంఘం మహిళ అధ్యక్షురాలు ఆలేటినవ్య, లంకె మల్ల చిన్నసీతమ్మ, పసుపులేటి లక్ష్మమ్మ,కంబాల సీతమ్మ, వీరిశెట్టి రవికుమార్, గంజి శివ, మేకల సేదయ్య, చిలక రాజ్ అజయ్ కుమార్, కడియాల అశోక్, శాసనాల రవికుమార్, మేకల వీరయ్య, కర్నే కృష్ణ, దుగ్గి వర్మ, సరస్వతి శ్రీనివాసరాజు, కొట్టు శేఖర్, సంగిశెట్టి వెంకటేశ్వర్లు, షేక్ సైదులు, రాజారత్నం బెల్లంకొండ ప్రసాద్, జక్కుల వెంకటరావు, చందాల శ్రీనివాస్ పాల్గొన్నారు.




## ప్రభుత్వ కమలా నెహ్రూ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేసిన టీజీ ఎస్ పి ఎఫ్

**99 రోజుల ప్రణాళికలో భాగంగా సేవా కార్యక్రమం**

నాగార్జునసాగర్, మే 19( వాయిస్ టుడే): నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం నాగార్జునసాగర్ విభాగం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం సంచాలకురాలి ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగమైన 99 రోజుల కార్యాచరణ కింద ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నాగార్జునసాగర్ విభాగం అసిస్టెంట్ కమాండెంట్ బి.రాజు నేతృత్వంలో మొత్తం 14 మంది అధికారులు, సిబ్బంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ పి ఎఫ్ నాగార్జునసాగర్ విభాగం అసిస్టెంట్ కమాండెంట్ బి.రాజు మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయడమే తమ దళం లక్ష్యమని, సంచాలకురాలి సూచనల మేరకు ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. రోగుల ఆరోగ్యానికి దోహదపడే ఇటువంటి కార్యక్రమం పట్ల ఆసుపత్రి వర్గాలు, రోగుల బంధువులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ పి ఎఫ్ జెన్కో ఆర్ఐ ప్రతాప్ నాయుడు, సాగర్ డ్యాం ఎస్ పి ఎఫ్ ఆర్ఐ శ్రీనివాసరావు మరియు జెన్కో, సాగర్ డ్యాం ఎస్ పి ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ వృద్ధురాలికి చేయూత.



రాజన్న సిరిసిల్ల జిల్లా:, వాయిస్ టుడే ప్రతినిధి: భీంగల్ వాస్తవ్యురాలు జంబుక రాజలింగు 55 సంవత్సరాలు రాజన్న ఆలయానికి వచ్చి అక్కడ ఏడుస్తూ కూర్చున్న ఆమెను హోంగార్డు పద్మ గమనించి ఆవిడ వద్ద నుండి వివరాలు తీసుకుని జంబుక రాజలింగు అనే ఆవిడను వృద్ధాశ్రమానికి పంపించాలి అని మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ వారికి సమాచారం అందించడంతో ఆవిడను వేములవాడ పట్టణ పోలీసు స్టేషనుకు తీసుకెళ్లి వారి అనుమతితో ఓబులాపురం లోని అమ్మ అనాధ శరణాలయనికి పంపించడం జరిగిందని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ హోం గార్డు పద్మ పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**